ప్రతి అక్షరం ప్రజాహితం
RNI No: APTEL -2023/89112 www.andhrapragathi.com
నేటి ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక
సంపుటి - 03 సంచిక -64 పేజీలు - 05 వెల - 04/- బుధవారం 11 మార్చి 2026

# ఇరాన్ కొత్త సుప్రీం లీడర్‌కు ట్రంప్ వార్నింగ్

**ఇరాన్ కొత్త సుప్రీం లీడర్‌గా మొజ్తబా ఖమేనీ నియామకం**

**ఈ నిర్ణయంపై తీవ్రంగా స్పందించిన డొనాల్డ్ ట్రంప్**

**"అతను ప్రశాంతంగా జీవించలేడు" అంటూ ఘాటు హెచ్చరిక**

**నియామకంలో తన ప్రమేయం ఉండాల్సిందని వ్యాఖ్య**

**పెరుగుతున్న అమెరికా-ఇరాన్ ఉద్రిక్తతలు**




# అవిశ్వాస రగడ

**లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లపై అవిశ్వాసం**

**జగదంబికా పాల్ ప్రత్యేక స్పీకర్‌గా విధులు**

**చర్చను ప్రారంభించిన కాంగ్రెస్ ఎంపి జావెద్**

**కాంగ్రెస్ సంప్రదాయాలు పాటించడం లేదన్న కిరణ్ రిజిజు**

**నెహ్రూను తిట్టేవారు ఆయనను జపిస్తున్నారంటూ ప్రియాంక ఎదురుదాడి**



న్యూఢిల్లీ,**మార్చి 10,ఆంధ్ర ప్రగతి** లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాపై అవిశ్వాస తీర్మానం గురించి లోక్‌సభలో చర్చ ప్రారంభమైంది. ఓం బిర్లాపై అవిశ్వాస తీర్మానాన్ని కాంగ్రెస్ ఎంపీ మహమ్మద్ జావెద్ లోక్‌సభలో మంగళవారం ప్రవేశపెట్టారు. అనంతరం దీనిపై చర్చ ప్రారంభమైంది. ఈ చర్చ కోసం పది గంటల సమయం కేటాయించారు. అనంతరం తీర్మానంపై ఓటింగ్ నిర్వహించనున్నారు. స్పీకర్ ఓం బిర్లా నిష్పక్షపాతంగా వ్యవహరించడం లేదని, ఆయన అధికార పార్టీ భాష మాట్లాడుతున్నారని తీర్మానాన్ని ప్రవేశపెట్టిన కాంగ్రెస్ ఎంపీ మహమ్మద్ జావెద్ ఆరోపించారు.**మిగతా 2లో...**

# ఎపిలో పెరుగుతున్న ఎండల తీవ్రత

**ముందస్తు చర్యలపై ప్రభుత్వం అప్రమత్తం**

**అధికారులతో సమీక్షించిన హోంమంత్రి అనిత**



**అమరావతి,,మార్చి 10,ఆంధ్ర ప్రగతి**
రాష్ట్రంలో ఎండల తీవ్రత క్రమంగా పెరుగుతోంది. దీంతో ప్రభుత్వం అప్రమత్తం అయ్యింది. ముందస్తు చర్యలపై సమీక్షించింది. ఎండల తీవ్రత, వడగాల్పుల పరిస్థితులపై హోం, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి వంగలపూడి అనిత మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఏపీఎస్‌డీఎంఏ కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో కలెక్టర్లు, లైన్ డిపార్ట్‌మెంట్ల అధికారులు, విపత్తుల నిర్వహణ సంస్థ అధికారులు పాల్గొన్నారు.**మిగతా 2లో...**

# ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లలో క్రీమీలేయర్ విధానంపై సుప్రీంకోర్టులో విచారణ

**కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు నోటీసులు జారీ చేసిన సర్వోన్నత న్యాయస్థానం**

**రిజర్వేషన్ల ప్రయోజనాలు కొందరికే అందుతున్నాయని పిటిషన్‌లో ఆరోపణ**

**ఎస్సీ, ఎస్టీ వర్గాల్లోనే 'కులంలో కులం' ఏర్పడుతోందన్న పిటిషనర్ వాదన**

న్యూఢిల్లీ,**మార్చి 10,ఆంధ్ర ప్రగతి**
షెడ్యూల్డ్ కులాలు (ఎస్సీ), షెడ్యూల్డ్ తెగల (ఎస్టీ) రిజర్వేషన్లలో 'క్రీమీలేయర్' విధానాన్ని అమలు చేయాలని కోరుతూ దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్)పై సుప్రీంకోర్టు ఇవాళ విచారణ చేపట్టింది. ఈ పిటిషన్‌పై స్పందన తెలియజేయాలని కేంద్ర ప్రభుత్వం, అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు నోటీసులు జారీ చేసింది.సీజేఐ సూర్యకాంత్ నేతృత్వంలోని జస్టిస్ ఆర్. మహదేవన్, జస్టిస్ జాయ్‌మాల్యా బాగ్చీలతో కూడిన ధర్మాసనం ఈ మేరకు ఆదేశాలు ఇచ్చింది.**మిగతా 2లో...**



# నాలుగు కేటగిరీలుగా గ్రామ పంచాయతీలు

**ఏపీలో గ్రామ పంచాయతీల పునర్వర్గీకరణకు ప్రభుత్వ ఆమోదం**

**మూడు నుంచి నాలుగుకు పెరిగిన పంచాయతీల కేటగిరీలు**

**కొత్తగా 'రూర్బన్' పంచాయతీల ఏర్పాటుకు నిర్ణయం**

**జనాభా, ఆదాయాన్ని బట్టి పంచాయతీల కొత్త వర్గీకరణ**

**రూర్బన్ పంచాయతీల్లో పట్టణ స్థాయి సౌకర్యాల కల్పన**




**అమరావతి,,మార్చి 10,ఆంధ్ర ప్రగతి**
ఏపీలో గ్రామ పంచాయతీల స్వరూపాన్ని మారుస్తూ రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. పంచాయతీల పునర్వర్గీకరణకు అనుమతిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటివరకు మూడు రకాలుగా ఉన్న పంచాయతీలను, ఇకపై జనాభా, వార్షిక ఆదాయం ఆధారంగా నాలుగు కేటగిరీలుగా విభజించింది. ఇందులో భాగంగా**మిగతా 2లో...**

# గ్యాస్ సంక్షోభం..

## 'ఎస్మా' ప్రయోగించిన కేంద్రం

**గృహ అవసరాలకే తొలి ప్రాధాన్యమని వెల్లడి**

**హోటళ్లకు షాక్ ఇస్తూ కేంద్రం సంచలన నిర్ణయం**

**దేశవ్యాప్తంగా పలు నగరాల్లో మూతపడనున్న హోటళ్లు!**



న్యూఢిల్లీ,,**మార్చి 10,ఆంధ్ర ప్రగతి**
దేశవ్యాప్తంగా ఎల్‌పీజీ గ్యాస్ సిలిండర్ల కొరత తీవ్రం కావడంతో కేంద్ర ప్రభుత్వం అత్యవసర చర్యలకు ఉపక్రమించింది. ఇరాన్–ఇజ్రాయెల్ యుద్ధం నేపథ్యంలో ప్రపంచ ఇంధన సరఫరాలో ఏర్పడిన అంతరాయాల కారణంగా కమర్షియల్ ఎల్‌పీజీ కొరత **మిగతా 2లో...**

# ప్రత్యేకాధికారుల పాలనలోకి మున్సిపాలిటీలు, కార్పోరేషన్లు

**ఎపి ప్రభుత్వం ఆదేశాలు జారీ**

**అమరావతి,,మార్చి 10,ఆంధ్ర ప్రగతి** ఏపీ వ్యాప్తంగా 11 మున్సిపల్ కార్పొరేషన్లు, 75 మున్సిపాలిటీలు, నగరపంచాయతీలకు ప్రభుత్వం ప్రత్యేక అధికారులను నియమించింది. 6 నెలలు లేదా ప్రజాప్రతినిధులు ఎన్నికయ్యేవరకు ప్రత్యేక అధికారులు పాలన సాగించనున్నారు. ఈ నిర్ణయం వెంటనే అమల్లోకి రానుంది. విశాఖపట్నం, విజయవాడ, గుంటూరు, తిరుపతి, కడప, కర్నూలు, అనంతపురం, ఒంగోలు, విజయనగరం, మచిలీపట్నం, చిత్తూరు కార్పొరేషన్లలో ప్రత్యేక అధికారుల పాలన సాగనుంది. ఈ మేరకు పట్టణాభివృద్ధిశాఖ ముఖ్య కార్యదర్శి సురేశ్‌కుమార్ నోటిఫికేషన్ జారీ చేశారు.

# చైనా ఎఫ్ డి ఐ లకు కేంద్రం ఓకే



**ఎఫ్‌డీఐపై కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం**

**చైనా సహా సరిహద్దు దేశాల నుంచి సడలింపు**

**నిబంధనల సవరణకు కేబినెట్ ఆమోదం**

న్యూఢిల్లీ,,**మార్చి 10,ఆంధ్ర ప్రగతి**
విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల విషయంలో కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. భారత్‌తో సరిహద్దు పంచుకునే దేశాల నుంచి వచ్చే విదేశీ ప్రత్యేక్ష పెట్టుబడులపై అమల్లో ఉన్న నిబంధనలను కేంద్రం కొంతవరకు సడలించింది. మంగళవారం ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన కేంద్ర కేబినెట్ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. ఈ నిర్ణయంతో చైనా సహా పలు పొరుగు దేశాల పెట్టుబడులపై అమల్లో ఉన్న కొన్ని పరిమితులు సవరించారు. 2020లో అమల్లోకి తీసుకువచ్చిన ప్రెస్ నోట్--3 నిబంధనల్లో కేంద్రం మార్పులు చేసింది.**మిగతా 2లో...**

# దేశవ్యాప్తంగా మౌలిక సదుపాయాలకు పెద్దపీట

**ఏకంగా రూ. 8.8 లక్షల కోట్లతో ఆరు భారీ ప్రాజెక్టులు**

**జల్ జీవన్ మిషన్ పొడింపునకు మరో రూ.8.7 లక్షల కోట్ల**

**అంతర్జాతీయ విమానాశ్రయంగా మధురై ఎయిర్‌పోర్టు**

**రూ.2,905 కోట్లతో సంత్రాగచ్చి-ఖరగ్‌పూర్ ఫోర్‌లేన్ రోడ్డు**

**రూ.3,839 కోట్లతో బద్నావర్-థాండియామధ్య 5 లైన్ల రహదారి**

**కేంద్ర కేబినేట్ వివరాలు వెల్లడించిన కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్**




# బీచ్ సాండ్ మినరల్స్‌పై ప్రత్యేక దృష్టి


**'ఇంటిగ్రేటెడ్ స్ట్రాటజిక్ మెటీరియల్ హబ్'గా ఏపీ: సీఎం చంద్రబాబు**

**ఏపీ టైటానియం, స్ట్రాటజిక్ మెటీరియల్స్ మిషన్ ఏర్పాటుకు సన్నాహాలు**

**రాబోయే పదేళ్లలో రూ.50 వేల కోట్ల పెట్టుబడులు, 40 వేల ఉద్యోగాలే టార్గెట్**

**శ్రీకాకుళం, అనకాపల్లి, మచిలీపట్నంలో 3 ప్రాసెసింగ్ పార్కుల ఏర్పాటుకు ప్రతిపాదన**

**అమరావతి,,మార్చి 10,ఆంధ్ర ప్రగతి**
ఆంధ్రప్రదేశ్‌ను 'ఇంటిగ్రేటెడ్ స్ట్రాటజిక్ మెటీరియల్ హబ్'గా అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు లక్ష్యంగా నిర్దేశించారు. ఇందుకు రాష్ట్ర తీరప్రాంతంలో లభించే విలువైన బీచ్ సాండ్ వంటి ఖనిజ సంపదను సమర్థంగా వినియోగించుకోవాలని అధికారులను ఆదేశించారు. తద్వారా రాష్ట్ర పారిశ్రామికాభివృద్ధికి కొత్త ఊపునివ్వాలని సూచించారు. మంగళవారం సచివాలయంలో గనుల శాఖపై ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా 'ఆంధ్రప్రదేశ్ టైటానియం, స్ట్రాటజిక్ మెటీరియల్స్ మిషన్ (ఆప్రా-టూవీవీ)' ఏర్పాటు, పెట్టుబడుల ఆకర్షణ వంటి కీలక అంశాలపై అధికారులతో సుదీర్ఘంగా చర్చించారు.ఈ మిషన్ ద్వారా రాబోయే పదేళ్లలో రూ.50,000 కోట్ల పెట్టుబడులు ఆకర్షించడంతో పాటు, 40,000 మందికి **మిగతా 2లో...**



# చైనా ఎఫ్ డి ఐ లకు కేంద్రం ఓకే

**మొదటిపేజీ తరువాయి**

ఈ నిబంధన ప్రకారం భారత్‌తో భూసరిహద్దు ఉన్న దేశాలకు చెందిన కంపెనీలు లేదా ఆ దేశాల షేర్ హోల్డర్లు ఉన్న సంస్థలు భారత్‌లో ఏ రంగంలోనైనా పెట్టుబడి పెట్టాలంటే తప్పనిసరిగా ప్రభుత్వ అనుమతి తీసుకోవాల్సి వచ్చేది. ఇప్పుడు ఆ నిబంధనల్లో కొంత సడలింపు కల్పించినట్లు వర్గాలు చెబుతున్నాయి. భారత్‌తో భూసరిహద్దు పంచుకునే దేశాల్లో చైనా, బంగ్లాదేశ్, పాకిస్థాన్, భూటాన్, నేపాల్, మయన్మార్, అఫ్గానిస్థాన్? ఉన్నాయి. ఈ దేశాల నుంచి వచ్చే పెట్టుబడులు ఇప్పటివరకు కఠిన నియంత్రణల కిందనే కొనసాగుతున్నాయి. 2020 జూన్‌లో లద్ధాఖ్?లోని గల్వాన్ లోయ వద్ద భారత్ చైనా సైన్యాల మధ్య జరిగిన ఘర్షణ తర్వాత రెండు దేశాల మధ్య సంబంధాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఈ సంఘటన తర్వాతే కేంద్రం ప్రెస్ నోట్--3ను అమల్లోకి తెచ్చింది. దీని ద్వారా చైనా కంపెనీలు భారతీయ కంపెనీల్లో పెట్టుబడులు పెంచడాన్ని కట్టడి చేయాలని ప్రయత్నించింది. అదే సమయంలో డేటా భద్రత, జాతీయ భద్రత కారణాల నేపథ్యంలో కేంద్రం 200కు పైగా చైనా మొబైల్ యాప్‌లను నిషేధించింది. వాటిలో ప్రముఖంగా టిక్ టాక్, ఉయ్ చాట్?, యూసీ బ్రౌజర్ ఉన్నాయి.భారత్‌లో మొత్తం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల్లో చైనా వాటా చాలా తక్కువగా ఉందని అధికారిక గణాంకాలు సూచిస్తున్నాయి. 2000 ఏప్రిల్ నుంచి 2025 డిసెంబర్ వరకు వచ్చిన మొత్తం ఎఫ్‌డీఐలో చైనా వాటా కేవలం 0.32 శాతం మాత్రమే. విలువ పరంగా ఇది సుమారు 2.51 బిలియన్ అమెరికన్ డాలర్లుగా నమోదైంది. ఈ కారణంగా ఎఫ్‌డీఐ పరంగా చైనా భారత్‌లో 23వ స్థానంలో ఉంది. ఎఫ్‌డీఐ పరంగా చైనా వాటా తక్కువగా ఉన్నప్పటికీ, రెండు దేశాల మధ్య వాణిజ్యం మాత్రం వేగంగా పెరిగింది. ప్రస్తుతం చైనా భారత్‌కు రెండో అతిపెద్ద వాణిజ్య భాగస్వామిగా కొనసాగుతోంది. 2024- 25 ఆర్థిక సంవత్సరంలో చైనాకు భారత్ నుంచి ఎగుమతులు 14.5 శాతం తగ్గి 14.25 బిలియన్ డాలర్లకు చేరాయి. గత సంవత్సరం ఇది 16.66 బిలియన్ డాలర్లుగా నమోదైంది. అదే సమయంలో చైనా నుంచి భారత్‌కు దిగుమతులు 11.52 శాతం పెరిగి 113.45 బిలియన్ డాలర్లకు చేరాయి. గత ఏడాది ఇది 101.73 బిలియన్ డాలర్లుగా ఉంది. దీంతో రెండు దేశాల మధ్య వాణిజ్య లోటు భారీగా పెరిగింది. 2023--24లో 85 బిలియన్ డాలర్లుగా ఉన్న ట్రేడ్ డెఫిసిట్ 2024--25లో 99.2 బిలియన్ డాలర్లకు చేరింది. అయితే 2025- 26 ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్ నుంచి జనవరి వరకు భారత్ నుంచి చైనాకు ఎగుమతులు 38.37 శాతం పెరిగి 15.88 బిలియన్ డాలర్లకు చేరాయి. ఇదే కాలంలో దిగుమతులు 13.82 శాతం పెరిగి 108.18 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి. ఈ కాలానికి ట్రేడ్ డెఫిసిట్ సుమారు 92.3 బిలియన్ డాలర్లుగా ఉంది. ఇదే కేబినెట్ సమావేశంలో కేంద్రం మరో కీలక నిర్ణయం కూడా తీసుకుంది. కంపెనీల నిర్వహణ, దివాలా ప్రక్రియలకు సంబంధించిన చట్టాల్లో మార్పులకు ఆమోదం తెలిపింది. దీనికి సంబంధించిన సవరణలను ఇన్ సాల్వెన్సీ, దివాలా కోడ్, కంపెనీల చట్టం, 2013లో చేయనున్నట్లు సమాచారం. కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ అమలు చేస్తున్న ఈ రెండు చట్టాల్లో పలు మార్పులు తీసుకురావాలని ప్రభుత్వం భావిస్తోంది. ముఖ్యంగా దివాలా పరిష్కార ప్రక్రియలకు పట్టే సమయాన్ని తగ్గించే విధంగా మార్పులు ప్రతిపాదించినట్లు తెలిసింది. ఇందుకు సంబంధించిన బిల్లును గత ఏడాది ఆగస్టులో లోక్‌సభలో ప్రవేశపెట్టారు. అనంతరం దీనిని లోక్‌సభ సెలెక్ట్ కమిటీకి పంపించారు. ఆ కమిటీ 2025 డిసెంబర్‌లో తన నివేదికను సమర్పించింది. ఇటీవల కేంద్ర ఆర్థిక, కార్పొరేట్ వ్యవహారాల మంత్రి నిర్మలా సీతారామన్ కూడా ఐబీసీ సవరణ బిల్లును బడ్జెట్ సమావేశాల రెండో భాగంలో ప్రవేశపెట్టాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు తెలిపారు. ఈ మార్పుల ద్వారా పెట్టుబడుల ప్రవాహాన్ని పెంచడం, కంపెనీలకు వ్యాపార వాతావరణాన్ని మరింత సులభతరం చేయడం కేంద్ర ప్రభుత్వ లక్ష్యంగా ఉందని అధికారులు పేర్కొంటున్నారు.

## దేశవ్యాప్తంగా మౌలిక సదుపాయాలకు పెద్దపీట

**కేంద్ర కేబినేట్ వివరాలు వెల్లడించిన కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్**

ప్రధాని మోడీ అధ్యక్షతన మంగళవారం జరిగిన కేంద్ర కేబినెట్ పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. దేశవ్యాప్తంగా మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట వేస్తూ ఏకంగా రూ. 8.8 లక్షల కోట్ల విలువైన ఆరు భారీ ప్రాజెక్టులకు ఆమోదం తెలిపింది. ఇక జల్ జీవన్ మిషన్ పొడింపు కోసం మరో రూ.8.7 లక్షల కోట్లను కేటాయించింది. ముధురై ఎయిర్‌పోర్టును అంతర్జాతీయ విమానాశ్రయంగా ప్రకటించేందుకు కేంద్ర కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇక సంత్రాగచ్చి-ఖరగ్‌పూర్ మధ్య రూ.2,905 కోట్లతో నాలుగు లైన్ల రహదారి, రూ.3,839 కోట్లతో బద్నావర్-థాండియా-తిమర్వానీ మధ్య 5 లైన్ల రహదారి నిర్మాణానికి కేంద్రం ఆమోదం తెలిపింది. రూ.3,631 కోట్లతో జెవార్ విమానాశ్రయం-ఫరీదాబాద్ సెక్షన్‌ను కలిపే 6 లైన్ల ఎలివేటెడ్ రోడ్డు నిర్మాణానికి కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. కేంద్ర ప్రభుత్వం ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలో జరిగిన కేంద్ర మంత్రివర్గ సమావేశంలో తీసుకున్న ఈ నిర్ణయాలు దేశ ఆర్థిక వ్యవస్థను పరుగులు పెట్టించడమే కాకుండా, సామాన్యుల జీవన ప్రమాణాలను గణనీయంగా పెంచనున్నాయి. కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ ఈ వివరాలను మీడియాకు వెల్లడిస్తూ, ప్రభుత్వం చేపడుతున్న ఈ సంస్కరణలు భవిష్యత్ భారత్ నిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తాయని ధీమా వ్యక్తం చేశారు. కేబినెట్ భేటీలో అత్యంత కీలకమైన నిర్ణయం 'జల జీవన్ మిషన్ 2.0' ప్రారంభం. దీని కోసం ప్రభుత్వం సుమారు రూ. 8.7 లక్షల కోట్లను కేటాయించింది. 2019లో ప్రారంభమైన మొదటి దశలో ఇప్పటికే 81 శాతం గ్రామీణ గృహాలకు కుళాయి కనెక్షన్లు అందగా, ఇప్పుడు రెండో దశ ద్వారా మిగిలిన ప్రతి ఇంటికీ స్వచ్ఛమైన తాగునీరు అందించడమే కాకుండా, మౌలిక సదుపాయాల బలోపేతంపై దృష్టి సారించనున్నారు. అదనంగా లక్షల కోట్ల రూపాయల కేంద్ర సాయాన్ని పెంచడం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో నీటి ఎద్దడిని శాశ్వతంగా పరిష్కరించాలని కేంద్రం లక్ష్యంగా పెట్టుకుంది. తమిళనాడులోని ఆధ్యాత్మిక, చారిత్రక నగరమైన మధురైకి కేంద్రం అంతర్జాతీయ స్థాయి గుర్తింపునిచ్చింది. మధురై విమానాశ్రయాన్ని అంతర్జాతీయ విమానాశ్రయంగా ప్రకటిస్తూ తీసుకున్న నిర్ణయం దక్షిణ తమిళనాడు అభివృద్ధికి సరికొత్త రెక్కలు తొడిగింది. దీనివల్ల మీనాక్షి అమ్మన్ ఆలయం, రామేశ్వరం వంటి పుణ్యక్షేత్రాలకు వచ్చే విదేశీ పర్యాటకుల సంఖ్య పెరుగుతుంది. అంతేకాకుండా, మధురై చుట్టుపక్కల ఉన్న పారిశ్రామిక, విద్యా , వైద్య హబ్‌లకు అంతర్జాతీయ స్థాయి అనుసంధానం లభించి, స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపడనున్నాయి. ÷శవ్యాప్తంగా రైళ్ల రద్దీని తగ్గించి, రవాణా సామర్థ్యాన్ని పెంచేందుకు రూ. 4,474 కోట్ల వ్యయంతో రెండు ప్రధాన రైల్వే ప్రాజెక్టులను ప్రభుత్వం ఆమోదించింది. పశ్చిమ బెంగాల్, జార్ఖండ్ రాష్ట్రాల్లోని సాయింతియా-పాకూర్ , సంత్రాగచి-ఖరగ్‌పూర్ విభాగాల్లో నాలుగో రైల్వే లైన్ల నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్ లభించింది. ఈ అదనపు లైన్ల వల్ల కేవలం ప్రయాణికులకు మాత్రమే కాకుండా, బొగ్గు , ఇతర సరుకు రవాణా కూడా వేగవంతం కానుంది. ఇది భారతీయ రైల్వేల నిర్వహణ సామర్థ్యాన్ని పెంచడంలో ఒక మైలురాయిగా నిలవనుంది. రవాణా రంగాన్ని బలోపేతం చేసే క్రమంలో మధ్యప్రదేశ్‌లో కొత్తగా ఫోర్ లేన్ కారిడార్ నిర్మాణానికి కేబినెట్ ఆమోదం తెలిపింది. ఎన్‌హెచ్-752డి పరిధిలో బద్నావర్ నుండి తిమర్వానీ వరకు 80 కిలోమీటర్ల మేర నిర్మించబోయే ఈ రహదారి ఉజ్జయిని నగరాన్ని ఢిల్లీ-ముంబై ఎక్స్‌ప్రెస్‌వేతో నేరుగా అనుసంధానిస్తుంది. దీనితో పాటు, ఉత్తరప్రదేశ్‌లోని జేవార్ విమానాశ్రయాన్ని ఫరీదాబాద్‌తో కలిపే ఎలివేటెడ్ రోడ్డు ప్రాజెక్టును కూడా ఆమోదించారు. ఈ నిర్ణయాలన్నీ కలిపి దేశంలోని వివిధ ప్రాంతాల మధ్య ప్రయాణ సమయాన్ని తగ్గించడమే కాకుండా ఆర్థిక కార్యకలాపాలను వేగవంతం చేస్తాయని అశ్వినీ వైష్ణవ్ అన్నారు.

## ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లలో క్రీమీలేయర్ విధానంపై సుప్రీంకోర్టులో విచారణ

**మొదటిపేజీ తరువాయి**

ఇదే తరహా అభ్యర్థనతో ఇప్పటికే పెండింగ్‌లో ఉన్న మరో పిటిషన్‌తో ఈ వ్యాజ్యాన్ని జత చేసింది. మాజీ బ్యూరోక్రాట్ జ్ఞానేంద్ర కుమార్ ఖరే ఈ పిటిషన్‌ను దాఖలు చేశారు. ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లలో క్రీమీలేయర్‌ను అమలు చేయకపోవడం ఏకపక్షమని, రాజ్యాంగ విరుద్ధమని, రాజ్యాంగ మౌలిక స్వరూపాన్ని ఉల్లంఘించడమేనని ఆయన తన పిటిషన్‌లో పేర్కొన్నారు. రిజర్వేషన్ల ప్రయోజనాలు ఎస్సీ, ఎస్టీ వర్గాల్లోని ఉన్నత వర్గాలకే పదేపదే అందుతున్నాయని, దీనివల్ల ఆ వర్గాల్లోనే 'కులంలో కులం' ఏర్పడుతోందని పిటిషనర్ వాదించారు. దీని ఫలితంగా అత్యంత వెనుకబడిన నిరుపేదలు అవకాశాలకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.చారిత్రక అన్యాయాన్ని సరిదిద్దేందుకే రిజర్వేషన్లు ఉద్దేశించినవని, అవి శాశ్వత హక్కుగా మారకూడదని పిటిషన్‌లో తెలిపారు. ఓబీసీలకు క్రీమీలేయర్ విధానాన్ని ప్రవేశపెట్టిన ఇంద్రా సహానీ కేసు తీర్పును కూడా ఇందులో ప్రస్తావించారు. ఎస్సీ, ఎస్టీలలో ఉప వర్గీకరణ రాజ్యాంగబద్ధమేనని, వారికి క్రీమీలేయర్ వర్తింపజేయవచ్చని ఇటీవల ఓ రాజ్యాంగ ధర్మాసనం ఇచ్చిన తీర్పును కూడా పిటిషనర్ ఉటంకించారు. రిజర్వేషన్ల ఫలాలు సమాజంలోని అత్యంత వెనుకబడిన వర్గాలకు చేరేలా చూడటానికి క్రీమీలేయర్ గుర్తింపు, మినహాయింపు కోసం ఒక యంత్రాంగాన్ని రూపొందించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించాలని ఆయన కోరారు.

## ఎపిలో పెరుగుతున్న ఎండల తీవ్రత

**మొదటిపేజీ తరువాయి**

ఈ సందర్భంగా 'హీట్ వేవ్ యాక్షన్ ఎలాన్-2026'ను హోంమంత్రి ఆవిష్కరించారు. అధికారులందరూ ఈ ఎ÷-లాన్‌ను అనుసరించి ముందుకు సాగాలని ఆదేశించారు. సెంట్రల్ ఆంధ్ర, రాయలసీమ ప్రాంతాల్లో సాధారణం కంటే ఎక్కువ ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని ఏపీఎస్‌డీఎంఏ ఎండీ ప్రఖర్ జైన్ తెలిపారు. రాబోయే రోజుల్లో ఉష్ణోగ్రతలు మరింత పెరిగి వడగాల్పులు ఎక్కువగా వీచే అవకాశం ఉందని మంత్రి అనిత హెచ్చరించారు. అధికారులు నిరంతరం అప్రమత్తంగా పనిచేయాలని.. వడదెబ్బ కారణంగా ఎలాంటి ప్రాణనష్టం జరగకుండా చూడాలని హోంమంత్రి ఆదేశాలు జారీ చేశారు. పశువుల రక్షణకు సంబంధించి సూచనలు జారీ చేయాలని సూచించారు. వడదెబ్బ బారిన పడిన వారి చికిత్స కోసం బెడ్లు, మందులు, అంబులెన్సులు సిద్ధం చేయాలని వైద్యశాఖను ఆదేశించారు. విద్యుత్ అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కలెక్టర్లు.. ఎండ తీవ్రత జాగ్రత్తలపై విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. వృద్ధులు, పిల్లలు, బహిరంగ ప్రాంతాల్లో పనిచేసే కార్మికులపై ప్రత్యేక దృష్టి సారించాలని హోంమంత్రి తెలిపారు. నిరంతరాయంగా తాగునీటి సరఫరా ఉండేలా చర్యలు చేపట్టాలని అధికారులను హోంమంత్రి ఆదేశించారు. తాత్కాలిక చలువ కేంద్రాలను ఏర్పాటు చేయాలన్నారు. మార్కెట్లు, బస్టాండ్లు, కూడళ్లు వంటి జనసమూహ ప్రాంతాల్లో తప్పనిసరిగా చలివేంద్రాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఎన్జీవోలు, కమ్యూనిటీ గ్రూపుల ద్వారా మంచినీరు, మజ్జిగ వంటి పంపిణీ కార్యక్రమాలు చేపట్టాలని హోం, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి అనిత సూచించారు.

## నాలుగు కేటగిరీలుగా గ్రామ పంచాయతీలు

**మొదటిపేజీ తరువాయి**

పట్టణ లక్షణాలు సంతరించుకుంటున్న పెద్ద గ్రామాలను గుర్తిస్తూ కొత్తగా 'రూర్బన్' (రూరల్ + అర్బన్) పంచాయతీ కేటగిరీని ప్రవేశపెట్టింది.గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన పరిపాలన, పౌర సేవలు అందించడమే లక్ష్యంగా ఈ మార్పులు చేసినట్లు ప్రభుత్వం పేర్కొంది. సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు రూపొందించిన ప్రతిపాదనలకు ప్రభుత్వం ఆమోదముద్ర వేసింది. ఈ కొత్త వర్గీకరణ ప్రకారం రూర్బన్ పంచాయతీలలో పట్టణాలకు దీటుగా మౌలిక సదుపాయాలు కల్పించనున్నారు.

**రూర్బన్ పంచాయతీ:** 10 వేలకు పైగా జనాభా, రూ.కోటి కంటే ఎక్కువ వార్షిక ఆదాయం ఉండాలి. గిరిజన ప్రాంతాల్లో అయితే 5 వేలకు పైగా జనాభా ఉంటే సరిపోతుంది. ఈ పంచాయతీలలో పట్టణ తరహా సౌకర్యాలు కల్పిస్తారు.

**గ్రేడ్-1 పంచాయతీ:** 3 వేల నుంచి 10 వేల మధ్య జనాభా, రూ.30 లక్షల నుంచి రూ.కోటి లోపు వార్షిక ఆదాయం ఉండాలి. గిరిజన ప్రాంతాల్లో 2,500 నుంచి 5 వేల మధ్య జనాభా ఉండాలి. మండల కేంద్రంగా ఉన్న పంచాయతీలు ఈ గ్రేడ్ కిందికి వస్తాయి.

**గ్రేడ్-2 పంచాయతీ:** 2 వేల లోపు జనాభా ఉండాలి. గిరిజన ప్రాంతాల్లో జనాభా 1,500 నుంచి 2 వేల మధ్య ఉండాలి.

**గ్రేడ్-3 పంచాయతీ:** 1,500 కంటే తక్కువ జనాభా ఉన్న పంచాయతీలను ఈ కేటగిరీలో చేర్చారు.

ఈ నూతన వర్గీకరణతో పంచాయతీలకు వాటి జనాభా, ఆదాయ వనరులకు అనుగుణంగా నిధుల కేటాయింపు, అభివృద్ధి ప్రణాళికల రూపకల్పన సులభతరం అవుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. పెద్ద గ్రామాల్లో పెరుగుతున్న అవసరాలకు అనుగుణంగా సేవలు అందించేందుకు ఈ వ్యవస్థ దోహదపడుతుందని ప్రభుత్వం భావిస్తోంది.

## ఇరాన్ కొత్త సుప్రీం లీడర్‌కు ట్రంప్ వార్నింగ్

న్యూఢిల్లీ,,**మార్చి 10,ఆంధ్ర ప్రగతి**

అమెరికా, ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు మరోసారి తారస్థాయికి చేరాయి. ఇరాన్ కొత్త సుప్రీం లీడర్‌గా ఎంపికైన మొజ్తబా ఖమేనీని లక్ష్యంగా చేసుకుని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్రస్థాయిలో హెచ్చరికలు జారీ చేశారు. "అతను ప్రశాంతంగా జీవించగలడని నేను అనుకోవడం లేదు" అని ట్రంప్ వ్యాఖ్యానించారు.ఇరాన్ సుప్రీం లీడర్ అలీ ఖమేనీ మృతి తర్వాత ఆయన కుమారుడైన 56 ఏళ్ల మొజ్తబా ఖమేనీని కొత్త అధినేతగా ఎన్నుకున్నారు. ఈ నిర్ణయంపై ట్రంప్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. "ఇరాన్ ఈ నాయకుడిని ఎన్నుకోవడంపై నేను సంతోషంగా లేను. అతను ప్రశాంతంగా బతకలేడు" అని స్పష్టం చేశారు. ఇరాన్ సుప్రీం లీడర్ నియామక ప్రక్రియలో వెనెజువెలా తరహాలోనే తన ప్రమేయం కలిగి ఉండాల్సిందని ఆయన అభిప్రాయపడ్డారు.అంతేకాదు, ఖమేనీ విధానాలు గత పాలకుల మాదిరే కొనసాగితే ఐదేళ్లలో మరో యుద్ధం తప్పదని ట్రంప్ హెచ్చరించారు. "ఆ పదవిలో కొనసాగాలంటే అతను మా అనుమతి తీసుకోవాలి. లేకపోతే ఎక్కువ కాలం ఉండలేడు" అని ఓ ఇంటర్వ్యూలో ట్రంప్ వ్యాఖ్యానించారు.

# గ్యాస్ సంక్షోభం..'ఎస్మా' ప్రయోగించిన కేంద్రం

**మొదటిపేజీ తరువాయి**

ఏర్పడింది. దీంతో వంట గ్యాస్ క్రమబద్ధమైన సరఫరాను నిర్ధారించడానికి కేంద్ర ప్రభుత్వం 'నిత్యావసర వస్తువుల చట్టం' (ఎస్మా)ను ప్రయోగించింది. పశ్చిమాసియాలోని కీలక ఇంధన రవాణా మార్గాల్లో తలెత్తిన ఆటంకాల ఫలితంగా.. బెంగళూరు, ముంబై, చెన్నై వంటి ప్రధాన నగరాల్లోని హాస్పిటాలిటీ రంగం ఇప్పుడు అకస్మాత్తుగా కమర్షియల్ ఎల్‌పీజీ సిలిండర్ల కొరతను ఎదుర్కొంటోంది. సరఫరా పునరుద్ధరించకపోతే కొన్ని రోజుల్లోనే హోటళ్లు మూతపడవచ్చని రెస్టారెంట్ అసోసియేషన్లు హెచ్చరిస్తున్నాయి.

### ఏమిటీ 'ఎస్మా' ఆర్డర్?

పెట్రోలియం మంత్రిత్వ శాఖ జారీ చేసిన ఆదేశాల ప్రకారం.. దేశంలోని అన్ని ప్రభుత్వ మరియు ప్రైవేట్ ఆయిల్ రిఫైనరీలపై ప్రభుత్వం కఠిన ఆంక్షలు విధించింది. రిఫైనరీల్లో ఉత్పత్తి అయ్యే ప్రొపేన్, బ్యూటేన్ గ్యాస్ నిల్వలను కేవలం వంట గ్యాస్ తయారీకే వాడాలని, పెట్రోకెమికల్స్ తయారీకి మళ్లించకూడదని ప్రభుత్వం ఆదేశించింది. ఉత్పత్తి అయిన మొత్తం గ్యాస్‌ను కేవలం ప్రభుత్వ రంగ సంస్థలైన ఐఓసీ, బీపీసీఎల్, హెచ్ పీసీఎల్ లకు మాత్రమే విక్రయించాలని స్పష్టం చేసింది. ఈ ఆదేశాలను ఉల్లంఘిస్తే ఎస్మా చట్టం కింద క్రిమినల్ చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది.

### హోటళ్లు, రెస్టారెంట్లపై 'సిలిండర్' బాంబు!

గృహ అవసరాలకు ప్రాధాన్యమిస్తూ కమర్షియల్ గ్యాస్ సరఫరాపై ప్రభుత్వం ఆంక్షలు విధించింది. దీనివల్ల బెంగళూరు, చెన్నై, ముంబై వంటి నగరాల్లో కమర్షియల్ సిలిండర్ల సరఫరా నిలిచిపోవడంతో వందలాది హోటళ్లు మూతపడే స్థితికి చేరుకున్నాయి. దీంతో హోటళ్లను కూడా అత్యవసర సేవలుగా గుర్తించి గ్యాస్ సరఫరాను పునరుద్ధరించాలని హోటళ్ల అసోసియేషన్ వారు కోరుతున్నారు. దీనికి తోడు మార్చి 7 నుంచి గృహ వినియోగ గ్యాస్ సిలిండర్ ధర రూ.60, కమర్షియల్ సిలిండర్ ధర రూ.115 పెరగడం గోరుచుట్టుపై రోకలిపోటులా మారింది.

### హర్దీప్ పూరీ భరోసా..

కేంద్ర మంత్రి హర్దీప్ సింగ్ పూరీ మాట్లాడుతూ.. దేశంలో ఇంధన నిల్వలు పుష్కలంగా ఉన్నాయని, ప్రజలు ఆందోళన చెందవద్దని కోరారు. యుద్ధ ప్రభావిత ప్రాంతాల నుంచి కాకుండా, అమెరికా నుంచి దాదాపు 2.2 మిలియన్ టన్నుల గ్యాస్‌ను దిగుమతి చేసుకునేందుకు చారిత్రాత్మక ఒప్పందం కుదుర్చుకున్నామని, ఆ నిల్వలు ఇప్పటికే రావడం ప్రారంభించాయని ఆయన వెల్లడించారు.

# బీచ్ సాండ్ మినరల్స్‌పై ప్రత్యేక దృష్టి

**మొదటిపేజీ తరువాయి**

ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యం కావాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. కేవలం వనరులను వెలికితీయడమే కాకుండా, వాటికి విలువ జోడించడం (వాల్యూ ఎడిషన్)పై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. రేర్ మినరల్స్ విషయంలో కేంద్ర ప్రభుత్వం, ఇతర రాష్ట్రాలు అనుసరిస్తున్న విధానాలను క్షుణ్ణంగా అధ్యయనం చేయాలన్నారు. రాష్ట్రంలోని వనరులపై పూర్తి అవగాహన పెంచుకోవడంతో పాటు, భవిష్యత్ డిమాండ్‌కు అనుగుణంగా స్వల్ప, మధ్య, దీర్ఘకాలిక ప్రణాళికలు రూపొందించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా, రాష్ట్రంలోని తీరప్రాంతంలో లభించే బీచ్ సాండ్ మినరల్స్ దేశంలోనే అత్యంత విలువైనవని అధికారులు సీఎంకు వివరించారు. వీటిలో ప్రధానంగా ఇల్మెనైట్, రుటైల్, జిర్కాన్, మోనాజైట్, గార్నెట్, సిల్లిమనైట్ వంటి వ్యూహాత్మక ప్రాధాన్యమున్న ఖనిజాలు ఉన్నట్లు తెలిపారు. ఈ బీచ్ సాండ్ మినరల్స్ నుంచి వచ్చే ఉత్పత్తులు పెయింట్స్, కాస్మెటిక్స్, ఫార్మా రంగాలతో పాటు ఏరోస్పేస్, రక్షణ, శస్త్రచికిత్స పరికరాలు, సెరామిక్స్, ఎలక్ట్రానిక్స్, అణు ఇంధనం, అణు రియాక్టర్ల విడిభాగాల తయారీ వంటి అత్యంత కీలకమైన పరిశ్రమలకు అవసరమని అధికారులు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకొచ్చారు.ఈ ఖనిజ సంపదను సమర్థంగా వినియోగించుకునేందుకు రాష్ట్రంలో మూడు ముఖ్యమైన ప్రాసెసింగ్ పార్కులను ఏర్పాటు చేయాలని అధికారులు ప్రతిపాదించారు. శ్రీకాకుళంలో టైటానియం పార్క్ (ఏడాదికి 15 లక్షల టన్నుల ఉత్పత్తి లక్ష్యం), అనకాపల్లిలో రేర్ ఎర్త్ కారిడార్ (ఏడాదికి 25,000 టన్నుల ఉత్పత్తి లక్ష్యం), మచిలీపట్నంలో సమగ్ర టైటానియం, రేర్ ఎర్త్ కారిడార్‌లను ఏర్పాటు చేయాలని తమ ప్రతిపాదనలను సీఎం ముందుంచారు. ఈ సమీక్షా సమావేశంలో రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర, గనులు, ఎక్సైజ్ శాఖ ముఖ్య కార్యదర్శి ముఖేష్ కుమార్ మీనా, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

### 11, 12 తేదీల్లో కలెక్టర్ల కాన్ఫరెన్స్

రాష్ట్రంలో ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల అమలును వేగవంతం చేసే లక్ష్యంతో ముఖ్యమంత్రి చంద్రబాబు కీలక సమావేశానికి సిద్ధమయ్యారు. ఈ నెల 11, 12 తేదీల్లో రెండు రోజుల పాటు అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో కలెక్టర్ల కాన్ఫరెన్స్ నిర్వహించనున్నారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్లు, వివిధ శాఖల ఉన్నతాధికారులతో సీఎం చంద్రబాబు ముఖాముఖి సమీక్షలు జరిపి, పరిపాలన యంత్రాంగానికి స్పష్టమైన దిశానిర్దేశం చేయనున్నారు. సచివాలయంలోని ఐదో బ్లాకులో జరిగే ఈ సదస్సు మొదటి రోజు ఉదయం 10 గంటలకు సీసీఎల్ఏ స్వాగత ప్రసంగంతో మొదలవుతుంది. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ఉప ముఖ్యమంత్రి, మంత్రుల ప్రసంగాల అనంతరం ఉదయం 10:30 గంటలకు ముఖ్యమంత్రి చంద్రబాబు కీలకోపన్యాసం చేస్తారు. అనంతరం "స్వర్ణాంధ్ర ఏ2047" విజన్‌లో భాగంగా నిర్దేశించుకున్న పది సూత్రాల అమలుపై చర్చిస్తారు. పేదరిక నిర్మూలన, జల భద్రత, వ్యవసాయంలో సాంకేతికత వినియోగం వంటి అంశాలపై సమీక్షిస్తారు. రాష్ట్ర జీఎస్‌డీపీ వృద్ధి రేటు, జిల్లాల వారీగా సాధించిన ప్రగతిపై అధికారుల నుంచి వివరాలు అడిగి తెలుసుకుంటారు. డిజిటల్ గవర్నెన్స్‌లో భాగంగా ఈ-ఆఫీస్ ఫైళ్ల సత్వర పరిష్కారం, పెట్టుబడుల ఆకర్షణ వంటి అంశాలపై అధికారులకు మార్గనిర్దేశం చేస్తారు.

# అవిశ్వాస రగడ

**మొదటిపేజీ తరువాయి**

అనంతరం అవిశ్వాస తీర్మానంపై కేంద్రమంత్రి కిరణ్ రిజిజు చర్చను ప్రారంభించారు. స్పీకర్‌పై అవిశ్వాస తీర్మానం గురించి చర్చ జరుగుతున్న సమయంలో సభను నడిపేందుకు ప్రత్యేక సభాపతిని నియమించాలని విపక్షాలు డిమాండ్ చేశాయి. ఈ డిమాండ్‌కు కేంద్రం అంగీకరించింది. సీనియర్ ఎంపీ, చైర్ పర్సన్స్ ప్యానెల్ సభ్యుడు జగదాంబికా పాల్‌ను నియమించింది. ఆయన నేతృత్వంలో ప్రస్తుతం స్పీకర్ ఓం బిర్లా అవిశ్వాస తీర్మానంపై చర్చ చేపట్టారు. ప్రతిపక్షాల తరపున కాంగ్రెస్ ఎంపి గౌరవ్ గొగోయ్ మాట్లాడుతూ.. భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందం సహా పలు అంశాలపై లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీకి మాట్లాడేందుకు యత్నించారని, కానీ స్పీకర్ అనుమతినివ్వలేదని అన్నారు. ప్రతిపక్ష ఇండియా కూటమికి లోక్‌సభలో సుమారు 200మంది సభ్యులున్నప్పటికీ.. డిప్యూటీ స్పీకర్ లేరని అన్నారు. డిప్యూటీ స్పీకర్ లేకుండా సభ ఎలా నడుస్తుందో దేశ ప్రజలు చూడాలని అన్నారు. మైక్‌ని కూడా ఆయుధంగా వినియోగి స్తున్నారని అన్నారు. ఎన్‌డిఎ సభ్యులకు మాట్లాడేందుకు అనుమతినిస్తున్నారని, కానీ ప్రతిపక్షాలకు మాట్లాడేందుకు మైక్‌ని ఇచ్చేందుకు నిరాకరిస్తున్నారని అన్నారు. అయితే కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ సభలో హుందాగా మెలగడం లేదని పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు ఆరోపించారు. ఈ క్రమంలో గతంలో ప్రధాని మోదీని రాహుల్ ఆలింగనం చేసుకున్న ఘటనను ప్రస్తావించారు. ప్రధాని మోదీ దగ్గరకు వచ్చిన రాహుల్.. ఆలింగనం చేసుకొని వెళ్లి తన సీట్లో కూర్చున్నారు. అనంతరం తోటి ఎంపీలను చూసుకుంటూ కళ్లు ఎగరవేశారు. అటువంటి నేతను ఎప్పుడూ చూడలేదు' అని కిరణ్ రిజిజు పేర్కొన్నారు. ఈ సందర్భంగా గతంలో నెహ్రూ చెప్పిన నాటి స్పీకర్ జీవీ మావలాంకర్‌ను సమర్థిస్తూ మాటలను గుర్తుంచుకోవాలని కాంగ్రెస్ నేతలకు సూచించారు. దీనిపై దీటుగా స్పందించిన ప్రియాంకా గాంధీ.. ప్రభుత్వ తీరుపై మండిపడ్డారు.రిజిజు విమర్శలను ఎంపీ ప్రియాంకా గాంధీ తిప్పికొట్టారు. విపక్ష నేత రాహుల్ గాంధీ చెప్పే విషయాలను అధికార పక్షం జీర్ణించుకోలేక పోతోందన్నారు. గడిచిన 12 ఏళ్లలో ప్రభుత్వానికి దీటుగా నిలిచిన వ్యక్తి రాహుల్ ఒక్కరేనని అన్నారు. నెహ్రూను ఎప్పుడూ విమర్శించే వాళ్లు అకస్మాత్తుగా ఆయన్ను ప్రశంసించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. అందుకే తనకు నవ్వు వస్తోందన్నారు. నిరంతరం నెహ్రూను ఆడిపోసుకుంటున్న వారు ఆయన గురించి మాట్లాడంతో నవ్వు ఆపుకోలేక పోయానని అన్నారు. అయితే, ప్రధాని మోదీ, రాహుల్ గాంధీ సభలో లేని సమయంలో ఈ చర్చ జరిగింది. ఆ సమయంలో స్పీకర్ స్థానంలో టిడిపికి చెందిన తెన్నేటి కృష్ణప్రసాద్ ఉన్నారు.



ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రభ
తెలుగు దినపత్రిక
బుధవారం 11 మార్చి 2026

# బకాయిలు చెల్లించకపోతే..

# యూనివర్సల్ హెల్త్ స్కీమ్‌లో సేవలు ఇవ్వం..!

## .రాష్ట్ర ప్రభుత్వానికి ఆషా అసోసియేషన్ అల్టిమేటం.

**ఆంధ్ర ప్రగతి విజయవాడ,మంగళవారం 10:**
ఎన్టీఆర్ వైద్యసేవ నెట్‌వర్క్ ఆసుపత్రులకు చెల్లించాల్సిన బకాయిలను వెంటనే విడుదల చేయడంతో పాటు వైద్య ప్యాకేజీల రేట్లను పెంచకపోతే యూనివర్సల్ హెల్త్ స్కీమ్ లో భాగస్వామ్యం కావడానికి తాము సిద్ధంగా లేమని ఆంధ్రప్రదేశ్ స్పెషాలిటీ హాస్పిటల్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రభుత్వానికి స్పష్టమైన అల్టిమేటం జారీ చేసింది. విజయవాడలోని డివి మేనర్ హోటల్‌లో మంగళవారం జరిగిన ఆషా రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. అనంతరం నిర్వహించిన విలేఖర్ల సమావేశంలో ఆషా రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కె. విజయకుమార్ మాట్లాడుతూ..పలు కీలక అంశాలను వెల్లడించారు.
ఎన్టీఆర్ వైద్యసేవ నెట్‌వర్క్ ఆసుపత్రులకు ప్రభుత్వం చాలా నెలలుగా బకాయిలు చెల్లించకుండా ఉంచిందని,ఈ కారణంగా ఆసుపత్రులు తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయాయని తెలిపారు. బకాయిలను ఎప్పుడు.?ఎలా.? చెల్లిస్తారో కూడా స్పష్టత ఇవ్వకుండా ప్రభుత్వం కొత్తగా యూనివర్సల్ హెల్త్ స్కీమ్ అమలు చేయడానికి ప్రయత్నించడం అన్యాయమని ఆవేదన వ్యక్తం చేశారు.






### ఆషా అసోసియేషన్ ప్రధాన డిమాండ్లు.
ఎన్టీఆర్ వైద్యసేవ నెట్‌వర్క్ ఆసుపత్రులకు ఉన్న బకాయిలను వెంటనే విడుదల చేయాలి. వైద్య ప్యాకేజీల రేట్లను ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా పెంచాలి.
యూనివర్సల్ హెల్త్ స్కీమ్ రూపకల్పనలో ప్రైవేట్ ఆసుపత్రుల ప్రతినిధులను చేర్చాలి. వాస్తవ ఖర్చులను పరిగణనలోకి తీసుకుని ప్యాకేజీ రేట్లను నిర్ణయించాలి.

### పథకం రూపకల్పనపై ఆషా అసంతృప్తి.
యూనివర్సల్ హెల్త్ స్కీమ్ రూపకల్పనలో ప్రైవేట్ ఆసుపత్రుల ప్రతినిధులను ఎక్కడా సంప్రదించలేదని ఆషా నేతలు ఆరోపించారు. ఇలాంటి ప్రతిష్టాత్మక పథకాన్ని రూపొందించే సమయంలో ఆసుపత్రులు ఎదుర్కొంటున్న వాస్తవ పరిస్థితులను కూడా పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుందని వారు పేర్కొన్నారు.
కేవలం క్లినికల్ అనుభవం మాత్రమే ఉండటం సరిపోదని,నెట్‌వర్క్ ఆసుపత్రులు ఎదుర్కొంటున్న ఖర్చులు,పరిపాలనాపరమైన ఇబ్బందులపై పూర్తి అవగాహన అవసరమని ఆషా అధ్యక్షుడు డాక్టర్ విజయకుమార్ తెలిపారు. ఆసుపత్రుల ప్రతినిధులను కమిటీలో చేర్చి ఉంటే ఆచరణ సాధ్యమైన విధానాలు రూపొందేవని ఆయన అభిప్రాయపడ్డారు.

### ప్యాకేజీల రేట్లపై అసంతృప్తి.
ప్రభుత్వం ప్రకటిస్తున్నట్లుగా రాష్ట్ర పథకాల్లో ప్యాకేజీ రేట్లు ఎక్కువగా ఉన్నాయనే ప్రచారం వాస్తవానికి సరికాదని ఆషా నేతలు అన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకం కేవలం 2030 శాతం ప్రజలకు మాత్రమే వర్తిస్తుండగా,రాష్ట్ర ప్రభుత్వ పథకం దాదాపు 100 శాతం ప్రజలకు వర్తిస్తోందని తెలిపారు.
కొన్ని శస్త్రచికిత్సల్లో అవసరమైన ఇంప్లాంట్ల ఖర్చే 60 వేల రూపాయలకుపైగా ఉంటుందని,కానీ ప్యాకేజీ రేట్లు అందుకు సరిపోవడం లేదని పేర్కొన్నారు. అయినప్పటికీ ప్రభుత్వం 25 లక్షల వరకు వైద్య సహాయం అందిస్తామని చెప్పడం వల్ల ప్రజలు ఆసుపత్రులపై ఒత్తిడి తెస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

### ఆర్థిక ఇబ్బందుల్లో నెట్‌వర్క్ ఆసుపత్రులు.
ప్రస్తుతం ప్రభుత్వం ప్రతిపాదిస్తున్న విధానం ప్రకారం ఆసుపత్రులు కొంత డిస్కౌంట్ ఇస్తే రూ.1000 కోట్లు విడుదల చేస్తామని,మిగిలిన బకాయిలను భవిష్యత్తులో విడుదల చేస్తామని చెబుతున్నారని ఆషా ప్రతినిధులు పేర్కొన్నారు. వడ్డీ భారం పెరుగుతూ ఉండటంతో ఆసుపత్రులను నడపడం కూడా కష్టమవుతోందని తెలిపారు.
నాణ్యమైన వైద్యం పేదలకు అందించాలన్న లక్ష్యంతో ప్రారంభమైన ఈ పథకం ప్రభుత్వ విధానాల వల్ల నీరుగారిపోతుందని,భవిష్యత్తులో వైద్య ఖర్చుల భారం ప్రజలపై పడే ప్రమాదం ఉందని ఆషా ఆందోళన వ్యక్తం చేసింది.
ఈ సమావేశంలో ఆషా కార్యదర్శి డాక్టర్ అవినాష్,కార్యవర్గ సభ్యులు డాక్టర్ నాగమల్లేశ్వరావు,డాక్టర్ గిరి,డాక్టర్ నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

# అంగరంగ వైభవంగా

## సుంకుల పరమేశ్వరి దేవి బోనాల పండుగ

**సుంకులమ్మ తల్లికి బోనాలు సమర్పిస్తున్న గ్రామస్తులు. -భక్తిశ్రద్ధలతో సుంకుల పరమేశ్వరి పూజలు.**







**ఆంధ్ర ప్రగతి బండి ఆత్మకూరు మార్చి 10:**
బండి ఆత్మకూరు మండలంలోని చిన్నదేవలాపురం మజర బరకాల కాలనీ గ్రామంలో సుంకుల పరమేశ్వరి అమ్మవారికి భక్తిశ్రద్ధలతో మొక్కులు తీర్చుకున్నారు. గ్రామంలో వెలసిన సుంకులమ్మ అమ్మవారికి ప్రతి మూడు సంవత్సరాలకు ఒకసారి గ్రామస్తులు మొక్కులు సమర్పిస్తారు. కాలనీకి చెందిన సీనియర్ టిడిపి నాయకులు తాటికొండ బుగ్గ రాముడు,యువ నాయకుడు తాటికొండ మహేష్ బాబు, ఉమామహేశ్వరి,మేఘన తదితరులు సుంకులమ్మ అమ్మవారికి భక్తిశ్రద్ధలతో మొక్కులు తీర్చుకొని బోనాలు సమర్పించారు కాలనీ వాసులంతా అమ్మవారికి కాయ కర్పూరాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో తెలుగంగ ప్రాజెక్ట్ జిల్లా వైస్ చైర్మన్ కంచర్ల మనోహర్ చౌదరి, మైనార్టీ నాయకుడు జాకీర్ ఖాన్, మధు రెడ్డి, కొత్తూరయ్య, నందయ్య, అంజాద్, రంగస్వామి, తాటికొండ మల్లిఖార్జున, మాధవ,అబ్దుల్ రజాక్ సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు...

## ఉచిత ముస్లీం సామూహిక వివాహాలు.

**-ఏప్రిల్ 19 న అంజుమన్ ఆధ్వర్యంలో.నిఖా ఖర్చులు భరించి, వధువుకు రు.50,000/- బహుకరణ. -నశ్యం అబ్దుల్ ఖుద్దూస్.**

**ఆంధ్ర ప్రగతి నంద్యాల మార్చి 10:**
నంద్యాల అంజుమన్ సంస్థ ముస్లిం సమాజం కోసం పలు సామాజిక కార్యక్రమాలు నిర్వహించటం, పేద ముస్లీం యువతులకు ఉచిత సామూహిక వివాహాలు ప్రతి సంవత్సరం రెండు మూడు సార్లు చేయడం విదితమే. ఈ నేపథ్యంలో ఈ సంవత్సరం ఏప్రేల్ 19, ఆదివారం పేద ముస్లిం యువతులకు సామూహిక వివాహాలు నిర్వహించనున్నట్లు అంజుమన్ అధ్యక్షులు నశ్యం అబ్దుల్ ఖుద్దూస్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నంద్యాల పట్టణంలో నివసిస్తూ అంజుమన్ షాది ఖానా లో సామూహిక వివాహాలు చేయదలచిన పేద ముస్లిం వధువుకు 18, వరుడికి 21 సంవత్సరాలు ఉన్నవారు దరాఖాస్తు చేసుకోవచ్చన్నారు. అంజుమన్ షాది ఖానాలో ఉచిత దరాఖాస్తులు పొంది, వధువరుల ఆధార్, రెండేసి పాస్ పోర్ట్ ఫోటోలు, అమ్మాయి బ్యాంక్ పుస్తకం జిరాక్స్ కాపీలు జత చేసి 12,ఏప్రేల్ 2026 లోపు అంజుమన్ ఆఫీసులో దరాఖాస్తు చేసుకోవాలని, సామూహిక వివాహాలు 19 ఏప్రెల్ 2026, ఆదివారం ఉంటాయని ఖుద్దూస్ తెలిపారు. నిఖా ఖర్చులు భరించి వధువుకు రూ.50,000/- నగదు చెక్కు వివాహం రోజే బహూకరించునున్నట్లు అంజుమన్ అధ్యక్షులు ఖుద్దూస్ తెలిపారు. ఈ సమాచారం మస్జిద్ మాములు, ప్రజా సంఘాలు విస్తృతంగా ప్రచారం చేయాలని అంజుమన్ కమిటి కోరింది. పేద ముస్లీం తల్లితండ్రులు తమ పిల్లలకు సాముహికంగా వివాహాలు చేయుటకు ముందుకు రావాలని అంజుమన్ ఆహ్వానిస్తుంది.



## నంద్యాలలో ముందస్తు పన్ను చెల్లింపుపై అవగాహన సదస్సు.



**ఆంధ్ర ప్రగతి నంద్యాల, మార్చి 10:**
నంద్యాల పట్టణంలోని మధుమణి కాన్ఫరెన్స్ హాల్ నందు ఆదాయపు పన్ను శాఖ ఆధ్వర్యంలో ఈరోజు "ముందస్తు పన్ను చెల్లింపు" పై ప్రత్యేక అవగాహన సదస్సు ఇన్కమ్ టాక్స్ అధికారి మధుసూదన్ ఆధ్వర్యంలో నిర్వహించబడింది. ఆదాయపు పన్ను శాఖ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పన్ను చెల్లింపుదారులు సకాలంలో పన్ను చెల్లించడం వల్ల కలిగే ప్రయోజనాలు మరియు దేశాభివృద్ధిలో దాని ప్రాముఖ్యతను అధికారుల వివరించారు. బాధ్యతాయుతమైన పౌరులు ప్రతి పన్ను చెల్లింపుదారుడు ముందస్తు పన్నును నిర్ణీత గడువులోగా చెల్లించి దేశ నిర్మాణంలో తమ వంతు సహకారాన్ని అందించాలని అధికారులు కోరారు. జరిమానాల నివారణ సకాలంలో ముందస్తు పన్ను చెల్లించడం ద్వారా అదనపు వడ్డీ మరియు జరిమానాల నుండి తప్పించుకోవచ్చని అవగాహన కల్పించారు. పారదర్శకత పన్ను చెల్లింపు ప్రక్రియను మరింత సులభతరం చేసేందుకు మరియు ప్రజలలో ఉన్న సందేహాలను నివృత్తి చేసేందుకు ఈ కార్యక్రమం దోహదపడింది. ఈ కార్యక్రమంలో నంద్యాల ఆదాయపు పన్ను కార్యాలయ అధికారులు, కె.వి రంగారావు ఆడిటర్లు పాలూరు గోపికృష్ణ బి.గోపాలకృష్ణ సుబ్బయ్య భరత్ తదితరులు స్థానిక వ్యాపారవేత్తలు మరియు పన్ను సలహాదారులు పాల్గొన్నారు.

# జనసేన పార్టీ ఆశయంతో...పనిచేస్తుంది..!!

**నంద్యాల జనసేన పార్టీ నాయకులు మారాసు గురు బాబు ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం.**



**ఆంధ్ర ప్రగతి నంద్యాల మార్చి 10:**
రాష్ట్ర ప్రజలకు సుపరిపాలన అందించడమే ప్రధాన ధ్యేయంగా జనసేన పార్టీ పనిచేస్తుందని నంద్యాల జనసేన పార్టీ నాయకులు మారాసు గురు బాబు అన్నారు నంద్యాల పట్టణంలో జనసేన పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం ముమ్మరంగా చేపట్టారు. ఈ సందర్భంగా మారాసు గురుబాబు మాట్లాడుతూ జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ కూటమి ప్రభుత్వం సహకారంతో రాష్ట్రంలో వినూత్న పద్ధతిలో ప్రజలకు ఎనలేని సేవలు అందిస్తున్నారని అన్నారు. జనసేన పార్టీ మీద అభిమానంతో పార్టీ అందిస్తున్న సేవలకు గాను పెద్ద సంఖ్యలో మహిళలు మహిళలు సైతం నమోదు కార్యక్రమం చేయించుకుంటున్నారని అన్నారు ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ సభ్యులందరికీ జనసేన పార్టీ సభ్యత్వాన్ని నమోదు చేశారు.



# ప్రభుత్వ సంక్షేమ పథకాలకు రుణాలు మంజూరు చేయాలి.

## 2026-27 పొటెన్షియల్ లింక్డ్ క్రెడిట్ ప్లాన్‌కు రూ.14,576 కోట్లు. -జిల్లా రెవెన్యూ అధికారి డి. రాము నాయక్.

**ఆంధ్ర ప్రగతి నంద్యాల, మార్చి 10:** ప్రభుత్వ సంక్షేమ పథకాలలో అర్హులైన లబ్ధిదారులకు విస్తృతంగా రుణాలు మంజూరు చేయడంతో పాటు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల విజయవంతమైన అమలుకు బ్యాంకులు ఆర్థిక సహకారం అందించాలని జిల్లా రెవెన్యూ అధికారి డి. రాము నాయక్ పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో నిర్వహించిన డిస్ట్రిక్ట్ కన్సల్టేటివ్ కమిటీ, డిస్ట్రిక్ట్ లెవెల్ రివ్యూ కమిటీ సమావేశం జిల్లా రెవెన్యూ అధికారి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ఆర్బీఐ ఎల్డిఓ రామకృష్ణ, యూనియన్ బ్యాంక్ రీజినల్ హెడ్ నరసింహారావు, నాబార్డ్ డిడిఎం కార్తీక్, ఎల్డిఎం రవీంద్ర కుమార్, లైన్ శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిఆర్ఓ రాము నాయక్ మాట్లాడుతూ జిల్లాలో బ్యాంకులు ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ, అభివృద్ధి పథకాల అమలులో కీలక పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. ముఖ్యంగా రైతులు, స్వయం ఉపాధి పొందే యువత మరియు మహిళా సంఘాలకు రుణాల మంజూరులో బ్యాంకులు మరింత చురుకుగా వ్యవహరించాలని సూచించారు. ప్రధానమంత్రి ముద్రా యోజన, స్టాండ్ అప్ ఇండియా, పీఎంఎఫ్‌బీవై, పీఎంస్వనిధి వంటి పథకాల కింద అర్హులైన లబ్ధిదారులకు రుణాలను సకాలంలో మంజూరు చేయాలని బ్యాంకర్లను ఆదేశించారు. అలాగే వ్యవసాయ రుణాలు, పంట రుణాల పంపిణీ, స్వయం సహాయక సంఘాలకు రుణాల మంజూరుపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. జిల్లాలో ప్రాధాన్యత రంగ రుణాల పంపిణీ లక్ష్యాలను బ్యాంకులు తప్పనిసరిగా చేరుకోవాలని, పెండింగ్‌లో ఉన్న రుణ దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని తెలిపారు. ప్రభుత్వ పథకాల అమలులో బ్యాంకులు మరియు సంబంధిత శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేయాలని సూచించారు.





నాబార్డ్ డిడిఎం కార్తీక్ మాట్లాడుతూ రాష్ట్రంలో సాగుచేసే ప్రధాన పంటలకు వ్యాల్యూ చైన్ అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తున్నదన్నారు. రైతులకు మెరుగైన ఆదాయం అందించేందుకు షేడ్ నెట్స్, పాలీహౌస్‌లు, కోల్డ్ స్టోరేజ్‌లు, ప్రాసెసింగ్ యూనిట్లు, గ్రేడింగ్ మరియు ప్యాకింగ్ వంటి మౌలిక సదుపాయాలు అవసరమని తెలిపారు. రాయలసీమ ప్రాంతంలో ఉద్యానవన పంటలకు ఎగుమతి అవకాశాలు ఉన్నప్పటికీ, స్థానిక బ్యాంకుల నుంచి ఎగుమతి క్రెడిట్ పొందడంలో వ్యాపారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. రాబోయే ఆర్థిక సంవత్సరంలో బనగానపల్లె, బేతంచెర్ల ప్రాంతాల నుంచి ఎగుమతులను మరింత ప్రోత్సహించే చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. పథకం కింద నంద్యాల జిల్లాలో ఇప్పటివరకు యూనిట్లు మంజూరు కాలేదని పేర్కొన్నారు. రైతులు మరియు యువతలో అవగాహన పెంచేందుకు బ్యాంకుల్లో బ్రోచర్లు, పోస్టర్లు ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ పథకంలో ప్రాజెక్టు ఖర్చుపై 40 శాతం వరకు సబ్సిడీ లభిస్తుందని తెలిపారు. అదేవిధంగా కు ప్రాధాన్యత రంగ రుణాల కింద బ్యాంకులు సహకారం అందించాలని, ప్రతి బ్యాంకు కనీసం 40 శాతం ఖీూలకు రుణాలు అందించే లక్ష్యంతో ముందుకు రావాలని సూచించారు.

ఆర్బీఐ ఎల్డిఓ రామకృష్ణ మాట్లాడుతూ 2025 జూలై నుండి 2026 జూన్ వరకు నిర్వహిస్తున్న కేవైసీ ప్రక్రియ గురించి వివరిస్తూ గడువు ముగియడానికి మూడు నెలలు మాత్రమే మిగిలి ఉన్న నేపథ్యంలో అన్ని బ్యాంకులు వేగవంతంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. క్రియాశీల ఖాతాల్లో కూడా అనేక కేవైసీ లు పెండింగ్‌లో ఉండటం ఆందోళనకరమని తెలిపారు. కేవైసీ ప్రక్రియను సులభతరం చేసేందుకు ఖాతాలను రెండు గ్రూపులుగా విభజించినట్లు తెలిపారు. ఫోకస్డ్ గ్రూప్‌లో క్రియాశీల ఖాతాలు మరియు ఒక సంవత్సరం కంటే తక్కువ కాలంగా నిలిచిపోయిన ఖాతాలు ఉంటాయని, రెండవ గ్రూప్‌లో ఒక సంవత్సరం కంటే ఎక్కువ కాలంగా నిలిచిపోయిన ఖాతాలు మరియు డి ఈ ఏ ఎఫ్ ఖాతాలు ఉంటాయని వివరించారు. మార్చి నెలాఖరు నాటికి ఫోకస్డ్ గ్రూప్‌కు చెందిన అన్ని ఖాతాల కేవైసీ లను పూర్తి చేసి పెండెన్సీని సున్నా స్థాయికి తీసుకురావాలని బ్యాంకులకు సూచించారు. ఈ ప్రక్రియను రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గవర్నర్ స్వయంగా పర్యవేక్షిస్తున్నందున బ్యాంకులు అత్యంత ప్రాధాన్యతతో తీసుకోవాలని తెలిపారు. మొత్తం 4243 బ్యాంకుల్లో సుమారు 15 బ్యాంకుల్లోనే 99.68 శాతం కేవైసీ పెండెన్సీ నమోదైందని, అందువల్ల ఆయా బ్యాంకులు తక్షణమే ప్రత్యేక చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఈ జాబితాలో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఏపీజీబీ, కెనరా బ్యాంక్, ఇండియన్ బ్యాంక్, పంజాబ్ నేషనల్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ బరోడా, కోటక్ మహీంద్రా బ్యాంక్, కరూర్ వైశ్యా బ్యాంక్, కర్ణాటక బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ ఇండియా, యూకో బ్యాంక్ మరియు సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఉన్నాయని తెలిపారు. ఈ బ్యాంకులు తక్షణమే స్పందించి లక్ష్యాలను చేరుకోవాలని సూచించారు. అంతకుముందు ఎల్డిఎం రవీంద్ర కుమార్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ప్రభుత్వ సంక్షేమ పథకాల కింద కేటాయించిన లక్ష్యాల సాధనలో బ్యాంకులు సాధించిన ప్రగతిని కమిటీకి వివరించారు. అనంతరం డిజిటల్ పేమెంట్స్ మరియు నాబార్డ్ 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన పొటెన్షియల్ లింక్డ్ క్రెడిట్ ప్లాన్ పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సమావేశంలో సంబంధిత శాఖల అధికారులు, వివిధ బ్యాంకుల బ్రాంచ్ మేనేజర్లు తదితరులు పాల్గొన్నారు.

## భవిష్యత్తు ఆరోగ్యానికి భద్రత..

# గర్భాశయ క్యాన్సర్ నివారణ టీకాలు.

**జిల్లా కలెక్టర్ శ్రీమతి జి. రాజకుమారి గణియా.**

**ఆంధ్ర ప్రగతి నంద్యాల, మార్చి 10:** 9 నుండి 14 సంవత్సరాల మధ్య వయస్సు గల బాలికలకు హెచ్ పివి టీకా వేయించడం ద్వారా గర్భాశయ ముఖద్వార క్యాన్సర్‌ను పూర్తిగా నివారించవచ్చని జిల్లా కలెక్టర్ శ్రీమతి జి. రాజకుమారి గణియా తెలిపారు. మంగళవారం నంద్యాల పట్టణంలోని గాంధీనగర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నివారణ వ్యాక్సినేషన్ కార్యక్రమంలో కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బాలికలకు చిన్న వయస్సులోనే హెచ్ పి వి టీకా వేయించడం ద్వారా భవిష్యత్తులో వచ్చే గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ ప్రమాదాన్ని పూర్తిగా నివారించవచ్చన్నారు. అందువల్ల 9 నుండి 14 సంవత్సరాల మధ్య వయస్సు గల బాలికలందరికీ ఈ టీకా తప్పనిసరిగా అందేలా ఆరోగ్య శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ విషయంపై తల్లిదండ్రులకు విస్తృత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. మానవ శరీరానికి సహజసిద్ధంగా ఉండే వ్యాధి నిరోధక శక్తి గురించి వివరించిన కలెక్టర్, పుట్టినప్పటి నుంచి తల్లి పాల ద్వారా లభించే సహజ రోగనిరోధక శక్తి తో పాటు, టీకాల ద్వారా ఏర్పడే సంపాదిత రోగనిరోధక శక్తి ఆరోగ్య పరిరక్షణలో కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. చిన్నతనం నుంచే ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎం ల ద్వారా అందించే టీకాలను సకాలంలో వేయించుకోవడం వల్ల భవిష్యత్తులో అనేక వ్యాధులను నివారించవచ్చన్నారు. జలుబు, దగ్గు వంటి అంటువ్యాధులతో పాటు మధుమేహం, రక్తపోటు,




క్యాన్సర్, కిడ్నీ సమస్యల వంటి దీర్ఘకాలిక వ్యాధుల పట్ల కూడా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం నిర్వహిస్తున్న ఎన్డీసీ 4.0 సర్వే ద్వారా ప్రతి ఇంటి ఆరోగ్య వివరాలను సేకరించి ప్రజల ఆరోగ్య పరిస్థితులను తెలుసుకునే ప్రయత్నం జరుగుతోందని తెలిపారు. దీర్ఘకాలిక వ్యాధుల గుర్తింపుకు సంబంధించి నిర్వహిస్తున్న ఎన్ డి సి 4.0 సర్వేను పకడ్బందీగా పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులకు ఆదేశించారు. సచివాలయం పరిధిలోని ప్రతి కుటుంబానికి సంబంధించిన ఆరోగ్య సమాచారం ఏఎన్ఎం ల వద్ద అందుబాటులో ఉండాలని స్పష్టం చేశారు. గ్రామాల్లో ఎవరైనా అనారోగ్యంతో బాధపడుతున్నా లేదా బయట నగరాల్లో చికిత్స పొందుతున్నా వారి వివరాలను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎం లు సమన్వయంతో పనిచేసి ప్రభుత్వం అందిస్తున్న ఉచిత వైద్య సేవలు, మందులు ప్రతి రోగికి అందుతున్నాయో లేదో నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. సేకరించిన ఆరోగ్య వివరాలను వెంటనే ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేయాలని, విధుల్లో నిర్లక్ష్యం వహించరాదని కలెక్టర్ స్పష్టం చేశారు. వ్యాధులు సోకిన తర్వాత చికిత్స చేయడం కంటే ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం అత్యంత ముఖ్యమని కలెక్టర్ తెలిపారు. చిన్నతనం నుంచే పిల్లలకు అవసరమైన అన్ని రకాల టీకాలను సకాలంలో వేయించడం ద్వారా ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించవచ్చన్నారు. జిల్లాలో ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని, ఆ లక్ష్య సాధనలో క్షేత్రస్థాయి ఆరోగ్య సిబ్బంది అంకితభావంతో పనిచేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డిఎంహెచ్ఓ డా. వెంకటరమణ, డిసిహెచ్ఎస్ డా. శ్రీదేవి, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డా. సుదర్శన్, ఇతర వైద్యాధికారులు, ఏఎన్ఎం లు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



## మార్కెట్ యార్డ్ చైర్మన్ గుంటుపల్లి హరిబాబు ఆధ్వర్యంలో ఉచిత పశు వైద్య శిబిరం

**ఆంధ్ర ప్రగతి నంద్యాల రూరల్ మార్చ్ 10:** పదవ తేదీ మంగళవారం నాడు ఉమ్మడి కర్నూలు జిల్లాలో మొదటిసారిగా న్యాయ మరియు మైనార్టీ శాఖ మంత్రి ఎన్ ఎం డి ఫారుక్ ఆదేశాల మేరకునంద్యాల మండలం కానాల గ్రామం నందు నంద్యాల మార్కెట్ యార్డ్ చైర్మన్ గుంటుపల్లి హరిబాబు ఆధ్వర్యంలో ఉచిత పశు వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. అదేవిధంగా పశువులకు వ్యాక్సిన్లు మందులు ఉచితంగా రైతులకు అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర తెలుగు యువత నాయకుడు ఎన్ ఎం డి ఫయాజ్, మరియు పశుసంవర్ధక శాఖకు సంబంధించిన జిల్లా అధికారులు, మార్కెటింగ్ శాఖకు సంబంధించిన ఏ డి ఏ సెక్రెటరీ మార్కెట్ యార్డ్ డైరెక్టర్లు సిబ్బంది, గ్రామ రైతులు, మరియు టిడిపి నాయకులు పాల్గొనడం జరిగింది.



## బీసీ బాలుర వసతి గృహ సంక్షేమ అధికారి సురేష్‌ను సస్పెండ్ చేయాలి.

**ఆంధ్ర ప్రగతి నంద్యాల మార్చి 10:** విద్యార్థుల సమస్యలు, గాలికి వదిలివేసిన బనగానపల్లె బిసి బాలుర వసతి గృహ సంక్షేమ అధికారి డబ్ల్యూహెచ్వో సురేష్ ని సస్పెండ్ చేయాలని, కోరుతూ నంద్యాల జిల్లా డి బీ సిడబ్ల్యుఓ జిల్లా అధికారులు జగ్గయ్య కి ఫిర్యాదు చేసిన విద్యార్థి సంఘాలు

ఈ సందర్భంగా బీసీ ఎస్సీ ఎస్టీ విద్యార్థి యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు వంకిరి రామచంద్రుడు, రాయలసీమ స్టూడెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు బందెల ఓబులేసు, డెమోక్రటిక్ విద్యార్థి యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు షేక్ రియాజ్, నేషనల్ ట్రైబల్ ఫెడరేషన్ నంద్యాల జిల్లా అధ్యక్షులు & ఎన్ టి ఎఫ్ సోషల్ మీడియా రాష్ట్ర గిరిజన విద్యార్థి సమాఖ్య, రాయలసీమ జిల్లా ల అధ్యక్షులు రవీంద్ర నాయక్ కోఆర్డినేటర్, ఏపీ విద్యార్థి జేఏసీ నాయకులు వేణు మాధవ్ రెడ్డి లు, మాట్లాడుతూ

బనగానపల్లె బీసీ బాలుర సంక్షేమ వసతి గృహంలో సమస్యలు అనేకం వున్నాయని,వార్డెన్ సురేష్ వారానికి రెండు సార్లు మాత్రమే హాస్టల్ కి వస్తారని,హాస్టల్ కి వచ్చిన రెండు రోజులు కూడా విద్యార్థులు సమస్యలు చెబితే పట్టించుకోరని,కేవలం ఆఫీస్ కి మాత్రమే పరిమితం అవుతున్నారని,ముఖ్యంగా గత 3 నెలల నుంచి హాస్టల్లో త్రాగడానికి మరియు కాలకృత్యాలు, బట్టలు ఉతకడానికి మరియు స్నానం చేయడానికి, సరిపడ నీరు లేకపోవడం తో పక్కనే వున్నా ఎస్సార్ బీసీ కాలువ లోకి వెళ్లి తమ అవసరాలు తీర్చుకుంటున్నారు అని, అక్కడ ప్రమాదవాష్యాతూ ఏదైనా జరగరాని సంఘటన జరిగితే భాద్యతలు ఎవరు వహిస్తారని,హాస్టల్ నందు నీళు పూర్తి స్థాయిలో లేకపోవడంతో 50 మందికి పైగా విద్యార్థులు తమ స్వంత ఊర్ల నుంచి ప్రయాణం చేస్తు మోడల్ స్కూల్ కి వస్తున్నారని, హాస్టల్లో లేని విద్యార్థులు స్కూల్ కి హాజరైనప్పుడు హాస్టల్ వాచమెన్ విద్యార్థులకు ఎఫ్ ఆర్ ఎస్ తీసి విద్యార్థుల సొమ్ము వార్డెన్ సురేష్



కాజేస్తున్నారని,భోజనం మెనూ ప్రకారం వడ్డించడం లేదని, నాణ్యత లేని భోజనం వడిస్తున్నారని దీని వల్ల విద్యార్థులు చాలా అవస్థలకు గురవుతున్నారనీ,క్లాస్ రూములు, విద్యార్థుల పడుకునే రూములు, తక్కువగా ఉండడం, విద్యార్థుల ఎక్కువ సంఖ్యలో ఉండడం తో సరిపడ వసతులు లేక చాలా ఇబ్బందులు పడుతున్నారని వారు అన్నారు విపరీతమైన దోమలు, ఈగలు, క్రిమికిటకాలు సరైన పరిశుభ్రత లేకపోవడంతో జ్వరాలు, అనారోగ్యలు సంభవిస్తే సరైన వైద్యం కూడా అక్కడ లేదని విద్యార్థుల తెలియజేసారు.

గత కొన్ని రోజుల కిందట వార్డెన్ కి విద్యార్థులు హాస్టల్ లోకి పాములు వస్తున్నాయని ఫిర్యాదు చేస్తే వార్డెన్ సురేష్ పాములు నివసించే ప్రదేశంలో మనం వున్నం కాబట్టి పాములు వస్తూనే ఉంటాయనీ ఆయన నిర్లక్ష్యంగా సమాధానం ఇస్తున్నారని,అక్కడ సిబ్బంది వంట రూములో నుండి కూరగాయలు, కిరాణా వస్తువులు, పాల ప్యాకెట్లు విటన్నిటి విద్యార్థుల కు సరైన విధంగా అందజేయకుండా పక్కదారి పట్టిస్తూ సొమ్ము చేసుకుంటున్నరని కాబట్టి ఈ సమస్యలకు కారణమైన వార్డెన్ ను విధులు నుండి తొలగించాలని వారు డిబి సిడబ్ల్యుఓ జగయ్య కి ఫిర్యాదు చేశారు.

# సూపర్ సిక్స్ హామీలు ఏవి?

## పట్టణ సమస్యలపై ఎర్రజెండా గర్జన.


### నంద్యాలలో ఏడో రోజూ హోరెత్తిన 'ప్రజానిధి' సేకరణ. ప్రభుత్వంపై సీపీఐ నిప్పులు

**ఆంధ్ర ప్రగతి నంద్యాల మార్చి 10:** రాష్ట్రంలో అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం, ఎన్నికల ముందు ఊదరగొట్టిన 'సూపర్ సిక్స్' హామీలను అమలు చేయడంలో ఘోరంగా విఫలమైందని సీపీఐ నాయకులు దుయ్యబట్టారు. నంద్యాల పట్టణంలో మంగళవారం పద్మావతి నగర్, సలీమ్ నగర్, చామకాల్వ, ప్రభుత్వ ఆసుపత్రి వెనుక భాగం తదితర ప్రాంతాల్లో సీపీఐ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'ప్రజానిధి' సేకరణ కార్యక్రమం ఏడో రోజుకు చేరుకుంది. సీపీఐ జిల్లా కార్యదర్శి ఎన్. రంగనాయుడు, జిల్లా సమితి సభ్యులు పి. మురళీధర్ నాయకత్వంలో రెండు బృందాలుగా విడిపోయి, ఇంటింటికీ, షాపులకు తిరిగి ప్రజల సమస్యలను క్షేత్రస్థాయిలో అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా రంగనాయుడు, మురళీధర్ మాట్లాడుతూ.. అంతర్జాతీయ యుద్ధ పరిస్థితులను సాకుగా చూపి గ్యాస్ ధరలను పెంచడం పేద, మధ్యతరగతి మహిళల నడ్డి విరుస్తోందని విమర్శించారు. నేటి డిజిటల్ యుగంలో ఆన్‌లైన్ ఫుడ్ డెలివరీ సంస్థల విజృంభణతో స్థానిక చిరు వ్యాపారులు జీవనోపాధిని కోల్పోతున్నారని, షాపుల అద్దెలు, కరెంట్ బిల్లులు కూడా చెల్లించలేక వ్యాపారాలు మూసివేసే దయనీయ స్థితికి చేరుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

పట్టణంలో వేసవికాలం ప్రారంభం కాకముందే కొన్ని ప్రాంతాలలో నీటి ఎద్దడి మొదలైందని, అధికారులు తక్షణమే స్పందించి త్రాగునీరు సక్రమంగా అందేలా చూడాలని వారు





కోరారు. ముఖ్యంగా పద్మావతి నగర్, సలీమ్ నగర్ ప్రాంతాలలో డ్రైనేజీ పూడికలు తీయక మురుగునీరు నిలిచిపోయి, దోమల బెడద తీవ్రమైందని మండిపడ్డారు. పట్టణంలో కనీసం ఫాగింగ్ చేయించే నాథుడే కరువయ్యారని అధికారుల పనితీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే, నూతన రోడ్ల నిర్మాణం చేపట్టినప్పటికీ, సరైన ప్రణాళిక లేకపోవడంతో ట్రాఫిక్ సమస్య మరింత జటిలమవుతోందని వారు పేర్కొన్నారు.

ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రభ
తెలుగు దినపత్రిక
బుధవారం 11 మార్చి 2026

# ఆహార భద్రత ప్రమాణాల చట్టం-2026 పై అవగాహన సదస్సు.

**.. వ్యాపారస్తులకు అవగాహన కల్పించిన నంద్యాల జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారులు.**



**ఆంధ్ర ప్రగతి నంద్యాల మార్చి 10:** నంద్యాల పట్టణంలోని హోటల్స్, రెస్టారెంట్లు, బేకరీలు మరియు స్వీట్ షాప్స్ నిర్వహిస్తున్న వ్యాపారస్తులకు ఆహార భద్రతపై అవగాహన కల్పించే ఉద్దేశంతో జిల్లా ఫుడ్ సేఫ్టీ ఇన్స్పెక్టర్ వేంకట రాముడు, ఫుడ్ సేఫ్టీ అధికారి ఖాసిం వలి అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సదస్సులో ఆహార భద్రత ప్రమాణాల చట్టం2026 ప్రకారం ఆహార పదార్థాలలో కల్తీని నివారించడం, పరిశుభ్రత పాటించడం, వినియోగదారులకు నాణ్యమైన ఆహారాన్ని అందించడం వంటి అంశాలపై అధికారులుచే వ్యాపారస్తులకు వివరించారు.అలాగే హోటల్స్, రెస్టారెంట్లు, బేకరీలు మరియు స్వీట్ షాప్స్ యజమానులు ప్రభుత్వ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, ఆహార పదార్థాల తయారీ, నిల్వ మరియు విక్రయంలో పరిశుభ్రత ప్రమాణాలను కచ్చితంగా అమలు చేయాలని సూచించారు.ఆహారంలో కల్తీకి పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఫుడ్ సేఫ్టీ అధికారులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నంద్యాల పట్టణానికి చెందిన పలు హోటల్, రెస్టారెంట్, బేకరీ మరియు స్వీట్ షాప్స్ వ్యాపారస్తులు పాల్గొన్నారు.

# సంఘ సంస్కర్త శ్రీమతి సావిత్రీబాయిపూలే సేవలు చిరస్మరణీయం.

**సామాజిక కార్యకర్త డోన్ పి. మహమ్మద్ రఫి.**



**ఆంధ్ర ప్రగతి డోన్ మార్చ్ 10:**
డోన్ పట్టణం లో సామాజిక కార్యకర్త డోన్ పి. మహమ్మద్ రఫి ఆధ్వర్యంలో శ్రీమతి సావిత్రీ భాయి పూలే వర్ధంతి సందర్భంగా వారి చిత్ర పటానికి పూలమాల వేసి ఘణంగా నివాళి అర్పించారు. వారిని స్మరించుకున్నారుఈ సందర్భంగా సామాజిక కార్యకర్త డోన్ పి. మహమ్మద్ రఫి మాట్లాడుతూ.. మన దేశ స్వాతంత్ర్య సమరయోధులను, శాస్త్రవేత్తలను ,మహనీయులను, సమాజానికి సేవలు అందించిన ప్రతి ఒక్కరిని స్మరించుకుంటూ వారి అడుగుజాడల్లో నడవాలని సామాజిక కార్యకర్త డోన్ పి.మహమ్మద్ రఫి కోరారు.శ్రీమతి సావిత్రీబాయిపూలే జనవరి 3 –1831 న జన్మించారు. భారతీయ సంఘ సంస్కర్త, ఉపాధ్యాయిని మరియు రచయిత్రి. ఆమె వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన జ్యోతీరావ్ పూలే భార్య. కులమత భేదాలకు అతీతంగా సమాజాన్ని ప్రేమించిన ప్రేమస్వరూపిణి.ఆధునిక విద్య ద్వారానే స్త్రీ విముక్తి సాధ్యపడుతుందని నమ్మిన సావిత్రీబాయి భర్తతో కలిసి 1848 జనవరి 1న పూణేలో మొట్టమొదటగాబాలికల పాఠశాలను ప్రారంభించింది. మహిళల సకల హక్కులకోసం పోరాటం చేయటం తమ సామాజికబాధ్యతగా ఆ దంపతులు విశ్వసించారు. నూతన వ్యవస్థ కోసం, ప్రాణాల్ని సైతం పణంగా పెట్టి సమిష్టిగా పోరాటం చేసారు.మహిళా హక్కులే మానవ హక్కులని తొలిసారిగా నినదించినది సావిత్రిబాయి పూలే. సమాజంలో "సత్యాన్ని" శోధించడానికి 1873 లో తన భర్త మహాత్మా పూలేతో కలసి "సత్యశోధక్ సమాజ్ "ను ప్రారంభించి బాల్యవివాహాలకు,మూడనమ్మకాలకు, సతీసహగమనానికి వ్యతిరేఖంగా మరియు వితంతువు పునఃర్వివాహాల కొరకు బలమైన ఉద్యమం నడిపారు. కరువు వాతపడిన అనాథ బాలలను అక్కున చేర్చుకున్నారు. తమ పాఠశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం ప్రారంభించినారు. సావిత్రిబాయి సంఘ సంస్కర్తగా ప్రజల మనస్సున చిరస్మరనీయురాలిగా నిలిచారు. సావిత్రి బాయి జయంతిని భారతదేశ మహిళా ఉపాధ్యాయులదినోత్సవంగాజరుపుకుంటున్నాము. సావిత్రిబాయి పూలే జీవితాన్ని ఆదర్శంగా తీసుకొని ప్రతి ఒక్కరు చదువులోను, సమాజ సేవలోను రాణించాలని సామాజిక కార్యకర్త డోన్ పి. మహమ్మద్ రఫి కోరారు.

## విజయ మహిళా మండలి ఆధ్వర్యంలో

# పౌష్టికాహార పంపిణీ కార్యక్రమం







**ఆంధ్ర ప్రగతి నంద్యాల మార్చి 10:**
ఆంధ్రప్రదేశ్ ఎయిడ్స్ కంట్రోల్ సంస్థ వారి సహకారంతో జిల్లా దిశ వారి సపోర్టుతో విజయ మహిళా మండలి వారి ఆధ్వర్యంలో దాతలు సహకారంతో పౌష్టికాహార పంపిణీ చేయడం జరిగింది. 25 మంది బాధితులకు పౌష్టికాహారాన్ని పంపిణీ చేయడం జరిగింది. అందులో పది కేజీల బియ్యం ఒక కేజీ మంచి నూనె, గోధుమపిండి, బుడ్డ పప్పులు, పప్పు చెక్క, పెసలు, మినుములు, అలసందలు, రాగి పిండి, బెల్లం మొదలైనవి ఎయిడ్స్ బాధితులకు ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా ఎయిడ్స్ టీబీ కంట్రోల్ అధికారి శ్రీమతి శారదాబాయి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇచ్చిన పౌష్టికాహారాన్ని ప్రతి ఒక్కరూ వేస్ట్ చేయకుండా ఉపయోగించుకోవాలని, సిడి ఫోర్ తగ్గకుండా వైరల్ లార్డ్ పెరగకుండా క్రమంగా మందులు తీసుకుంటూ మీ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని తెలిపారు. న్యూట్రిషన్ కిట్ లను డాక్టర్ శారదా భాయి చేతులమీదుగా పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి డిసిహెచ్ఎస్ డాక్టర్ఓ. లలిత, గైనకాలజిస్ట్ డాక్టర్ పద్మజ, సైకాలజిస్ట్ డాక్టర్ స్వరూప రాణి, ఏ ఆర్ టి డాక్టర్ నేసిన్, డాక్టర్ అనిల్ మరియు ఐసిటిసి కౌన్సిలర్స్ పి పి టి సి కౌన్సిలర్స్, డి ఎస్పీసీ కౌన్సిలర్, నేస్తం, నాగరాజు, మరియు విజయ మహిళా మండలి ప్రాజెక్టు మేనేజర్ వెంకటసుబ్బయ్య వారి సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది.

## అభిరుచి మధు ఆధ్వర్యంలో

# అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు.






**ఆంధ్ర ప్రగతి నంద్యాల మార్చి 10:**
అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా బీజేపీ మహిళా మోర్చా ఆధ్వర్యంలో నంద్యాల పట్టణంలోని విశ్వ హిందూ పరిషత్ కార్యాలయం లో నిర్వహించిన కార్యక్రమానికి నంద్యాల జిల్లా బిజెపి అధ్యక్షులు అభిరుచి మధు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. చిత్రపటానికి పూలమాల వేసిన అనంతరం నంద్యాల జిల్లా బిజెపి అధ్యక్షులు అభివృద్ధి మాట్లాడుతూ..సృష్టికి మూలం మహిళలని, ప్రతి మహిళను తల్లిగా చెల్లిగా అక్కగా వదినగా ఎన్నో పాత్రలను పూజిస్తూ కుటుంబాన్ని సమర్థవంతంగా ముందుకు నడిపిస్తున్న ప్రతి మహిళను గౌరవించాలని తెలిపారు. ఈ కార్యక్రమానికి బిజెపి మహిళా సోదరీమణులు పెద్ద ఎత్తున హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# నైపుణ్యాన్ని సద్వినియోగం చేసుకొని అభివృద్ధి చెందాలి.

**వక్ఫ్ ఆస్తులను సద్వినియోగం చేసుకోవాలి. -న్యాయశాఖ మరియు మైనారిటీ వెల్ఫేర్ శాఖ మంత్రి ఎన్.ఎం.డి ఫరూక్.**

**అన్ని వర్గాల వారిని అభివృద్ధిలోకి తీసుకొని వస్తున్నాం. -పరిశ్రమలు , వాణిజ్యం మరియు ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టి.జి. భరత్.**

**ఆంధ్ర ప్రగతి కర్నూలు, మార్చి 10:**
వృత్తి నైపుణ్యాన్ని సద్వినియోగం చేసుకొని అభివృద్ధి చెందాలని,వక్ఫ్ ఆస్తులను సద్వినియోగం చేసుకోవాలని, మైనారిటీ కార్పొరేషన్ ద్వారా లబ్ధి పొందాలని రాష్ట్ర న్యాయ మైనారిటీ సంక్షేమ మంత్రి ఎన్ ఎం డి ఫరూక్ అన్నారు.మంగళవారం కర్నూలులో ఉస్మానియా కాలేజీ దగ్గర టీ జి వెంకటేష్ షాది ఖానా హాల్లో జరిగిన కుట్టు మిషన్ల పంపిణీ కార్యక్రమం సందర్భంగా న్యాయశాఖ మరియు మైనారిటీ వెల్ఫేర్ శాఖ మంత్రి ఎన్ ఎం డి ఫరూక్ మాట్లాడుతూ... వక్ఫ్ బోర్డ్ దగ్గర ఖరీదైన భూములు ఉన్నాయని పట్టింపులకు తగాదాలకు పోకుండా వాటిని సద్వినియోగం చేసుకొని ముస్లిం మైనారిటీలు లబ్ధి పొందాలని కోరారు. గతంలో కర్నూలు జిల్లాకు నేను మంత్రి గా ఉన్నప్పుడు కేఈ కృష్ణమూర్తి కూడా మంత్రిగా ఉన్నారు అయ్యపు రెడ్డి పార్లమెంటు సభ్యులుగా ఉన్నారు. ఆ సమయంలో ఈద్ గా కు 10 ఎకరాల స్థలాన్ని కేటాయించాము, హాజీరా ఉమెన్స్ కాలేజ్ ను ఏర్పాటు చేశాం , ఆంధ్ర ప్రదేశ్ లో మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఏర్పాటు చేశాం , హైదరాబాద్ లో ఉర్దూ యూనివర్సిటీ ఏర్పాటు చేశాం, మఖాన్ – దుకాణ్ స్కీమ్ తీసుకుని వచ్చాం, కర్నూలుకు ఉర్దూ అకాడమీ ని తీసుకుని వచ్చాం, ముత్తవల్లిలకు, మౌజర్లకు గౌరవ వేతనం ఇస్తున్నామని, గతం లో కార్పొరేషన్ ద్వారా లక్షల్లో లోన్లు ఇప్పించాం గత ఐదు సంవత్సరాలు మాత్రం ఏమీ జరగలేదు అని తెలిపారు. ఇప్పుడు మళ్లీ కార్పొరేషన్ ద్వారా లోన్లు ఇప్పించే చర్యలు తీసుకుంటామని తెలిపారు. స్కిల్ కాంప్లెక్స్ కట్టాం కంప్యూటర్లు ఏర్పాటు చేశాం డెవలప్మెంట్ కు ప్రోత్సహిస్తున్నాము అని మీకున్న నైపుణ్యాన్ని ఇంకా



మెరుగుపరుచుకొని అభివృద్ధిలోకి రావాలని తెలిపారు . ఇపుడు మీకు కార్పోరేషన్ అందిస్తున్న 141 ( ఒకటి రూ6,400/- లు) కుట్టు మిషన్లతో మీ కుటుంబాలను వృద్ధి లోకి తీసుకొని రావాలని, కొత్తగా ఆలోచించి నైపుణ్యం పెంచుకొని మంచి పనులు చేసి మంచి గుర్తింపు తెచ్చుకోవాలని మహిళలను కోరారు. మీ నైపుణ్యాలను ఇంకా పెంచుకోవాలని మీ పిల్లల భవిష్యత్తును తీర్చిదిద్దాలని వారిని కోరారు.
ఈ సందర్భంగా పరిశ్రమలు , వాణిజ్యం మరియు ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టి జి భరత్ మాట్లాడుతూ... జిల్లాలో గత ప్రభుత్వ హయాంలో వక్ఫ్ కమిటీ ఏర్పాటు చేయకుండా ఉండిపోయారని దానివల్ల ముస్లిం మైనారిటీలకు నష్టం జరిగిందని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే కమిటీ ఏర్పాటు చేయడం జరిగిందని మంత్రి తెలిపారు. మైనారిటీ కార్పొరేషన్ ద్వారా 141 ( ఒకటి రూ6,400/- లు ) ఉషా కంపెనీ బ్రాండెడ్ కుట్టు మిషన్ల పంపిణీ లాంటి అభివృద్ధి పనులు జరుగుతున్నవి అని మంత్రి తెలిపారు. ఈ మిషన్లను సద్వినియోగం చేసుకొని ముస్లిం సోదరీమణులు అభివృద్ధిలోకి రావాలని మంత్రి ఆకాంక్షించారు. కర్నూలులో ఉర్దూ యూనివర్సిటీ పనులు పూర్తి చేయటానికి అన్ని చర్యలు తీసుకుంటున్నామని మా సొంత నిధులు కేటాయించి కూడా పనులు చేస్తున్నామని , కర్నూలు ఎగ్జిబిషన్ సొసైటీ మరియు కిడ్స్ వరల్డ్ పార్క్ ద్వారా వచ్చే దాదాపు 50 లక్షల రూపాయల ఆదాయాన్ని ముస్లిం మైనారిటీల కొరకు ఖర్చు చేస్తున్నామని మంత్రి తెలిపారు. స్థానిక బుధవారిపేటలోని దాదాపు 5




ఎకరాల స్థలాన్ని ఎం ఎస్ ఎం ఈ కి కేటాయించినట్లయితే అక్కడ చిన్న చిన్న పరిశ్రమలు నెలకొల్పి మరింత మందికి ఉపాధి అవకాశాలు కల్పించగలమని దీనివల్ల వక్ఫ్ బోర్డు కూడా ఆదాయం వస్తుందని, ఈ సమస్యపై సరైన చర్యలు తీసుకోవలసిందిగా మంత్రి ఫరూక్ ను కోరారు. కర్నూలు అసెంబ్లీ పరిధిలో ఏవైనా మసీదు కమిటీలు, షాదీ ఖానా కమిటీలు, కాంప్లెక్స్ కమిటీలు సరిగా పని చేయకపోయినా నిస్తేజంగా ఉన్న వివరాలు తెలిపినట్లైతే వాటిని సరైన దారిలో పెట్టి ముస్లిం మైనారిటీలకు లబ్ధి చేకూరేలా చర్యలు తీసుకుంటానని మంత్రి తెలిపారు. మా తండ్రి కట్టించిన ఈ టీజీవి షాదీఖానా ను నాలుగు సంవత్సరాలుగా నిరుపయోగంగా ఉంచారని మేము అన్ని మతాలను, అన్ని వర్గాలను సమదృష్టితో చూస్తామని , ఆదరిస్తామని , గౌరవిస్తామని అందుకే అందరికీ అందుబాటులో ఉండి సహాయ సహకారాలు అందిస్తున్నామని, కావున మమ్మల్ని ఆదరించాలని మాకు అండగా ఉండాలని ఈ సమావేశంలో కోరారు.

ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ నూరుల్ కమర్ మాట్లాడుతూ... కొత్తగా వస్తున్న విద్యా విధానాన్ని , విద్యను ముస్లింలు అభ్యసించాలని అప్పుడే వారి అభివృద్ధి సాధ్యమని, ముస్లింల అభివృద్దే దేశాభివృద్ధి అని తెలిపారు. గత 20 సంవత్సరాల నుండి చాలా అభివృద్ధి జరుగుతూ ఉన్నదని దాన్ని అందిపుచ్చుకోవాలని కోరారు. దాదాపు 3 లక్షల మంది కర్నూలు జిల్లాలో ముస్లింలు ఉన్నారని ప్రతి ఒక్కరూ మంచి విద్యను అభ్యసించి అభివృద్ధిలోకి రావాలని, నర్సింగ్ కోర్సులలో ఉద్యోగ అవకాశాలు చాలా ఉన్నాయని వాటిని అందిపుచ్చుకోవాలని జాయింట్ కలెక్టర్ ఆకాంక్షించారు.
ఈ సమావేశానికి క్రిస్టియన్ కార్పొరేషన్ ఎం.డి ఏ.శేఖర్ , జిల్లా మైనారిటీ వెల్ఫేర్ ఆఫీసర్ సబిహ పర్వీన్, హజ్ కమిటీ మెంబర్ మన్సూర్ అలీ ఖాన్, మైనారిటీ నాయకులు మహమ్మద్ ఖాన్, మహబూబ్ ఖాన్ , జియావుల్ హక్, జుబేర్, సల్మాన్, ఇమ్రాన్, ఇన్చార్జులు వెంకటేష్ ,శుక్రన్ లు పాల్గొన్నారు.